


Bhavani Publication Trust
https://prajatheerpudaily.com
APTEL/2001/5268

# ప్రజాతీర్పు

The people's Verdict
తెలుగు జాతీయ దినపత్రిక

సంపుటి : 24 | సంచిక : 358 | హైదరాబాద్ | బుధవారం 11 డిసెంబర్ 2024 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR

## ఆడబిడ్డలపై దుశ్శాసన పర్వం



**ఆశ కార్యకర్తల హామీలు నెరవేర్చాలి**

**ఎన్‌హెచ్చార్సీకి ఫిర్యాదు చేస్తం : కేటీఆర్**


**పోలీసుల దాడిలో గాయపడిన ఆశ కార్యకర్తలకు దవాఖానలో పరామర్శ**

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

ఇచ్చిన హామీలు నెరవేర్చాలని అడిగిన ఆశ కార్యకర్తలపై కాంగ్రెస్ ప్రభుత్వం దుశ్శాసన పర్వానికి దిగడం దుర్మార్గమని మాజీ మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. పోలీసుల దాడిలో గాయపడి ఉస్మానియా దవాఖానలో చికిత్స పొందుతున్న ఆశ కార్యకర్తలను మాజీ మంత్రులు మహమూద్ అలీ, సబితాఇంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డి, సీనియర్ నేతలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, దేవీప్రసాద్ తదితరులతో కలిసి మంగళవారం పరామర్శించారు. తీవ్రంగా గాయపడ్డ రహీమాబీ ఆరోగ్య

- మిగతా 2వ పేజీలో

**పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమై 11 రోజులు దాటినా ప్రధాని మోడీ సభలో గానీ బయటగానీ అదానీ వ్యవహారంలో నోరు విప్పడం లేదు. పార్లమెంట్ ఆవరణలో ప్రతి పక్షాలు అదానీ -మోడీ భారు భారు అంటూ వినూత్న ఆందోళనలు చేస్తున్నా నిమ్మకు నీరెత్తిన్నట్టు వ్యవహరిస్తున్నారు**



## రాజ్యసభ చైర్మెన్‌పై అవిశ్వాసం

**జగదీప్ ధన్కర్ ఏకపక్ష వైఖరిని ఖండిస్తూ ప్రతిపక్షాల నిర్ణయం**

**ఉభయసభలు నేటికి వాయిదా**

(ప్రజాతీర్పు ప్రతినిధి, ఢిల్లీ)

రాజ్యసభ చైర్మెన్ జగదీప్ ధన్కర్‌పై ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. ఆయన వ్యవహరిస్తున్న తీరు ఏకపక్షంగా ఉంటోందని ప్రతిపక్ష ఎంపీలు ఎప్పటి నుంచో చెబుతున్నారు. అయితే ఇటీవల కూడా ఆయన తీరును ప్రదర్శిస్తూ ప్రతిపక్షాలను ఉద్దేశించి విమర్శలు చేస్తున్నా రాజ్యసభ నుంచి తాము తరచూ వాకౌట్ చేయాల్సిన పరిస్థితికి చైర్మెన్ ధన్కర్ వైఖరే కారణమని ప్రతిపక్ష ఎంపీలు విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం చైర్మెన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానంపై ఇండియా బ్లాక్‌కు చెందిన కాంగ్రెస్, టీఎంసీ, సీపీఐ(ఎం), ఆప్, ఎస్‌పీ, డీఎంక్టె, ఆర్‌జేడీ, సీపీఐ తదితర పార్టీలకు చెందిన 50 మందికిపైగా ఎంపీలు సంతకాలు చేశారు. ఈ సంతకాలు

- మిగతా 2వ పేజీలో

## ఆడబిడ్డలను అవమానిస్తరా?



తెలంగాణ తల్లి విగ్రహ రూపురేఖలను కాంగ్రెస్ ప్రభుత్వం మార్చుడాన్ని నిరసిస్తూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు మంగళ వారం రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ తల్లి విగ్రహాలకు ప్రజలు క్షీరాభిషేకాలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాంగ్రెస్ అవమానపర్చిందని, విగ్రహం రూపురేఖలను మార్చి అపచారం చేసిందని నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు.

**సన్మానాలకు పురుషులే తప్ప మహిళలు పనికిరారా?**

**కవులు, కళాకారుల్లో ఆడబిడ్డలకు చోటు ఇవ్వలేదేం?**

**తెలంగాణ తల్లి నుంచి బతుకమ్మను దూరంచేయలేరు**

**ఊరూర్లా తెలంగాణ తల్లికి క్షీరాభిషేకం**

**ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలి**

**ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్**

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

తొమ్మిది మంది కవులు, కళాకారులను సన్మానించడమే కాకుండా వారికి ఇంటి స్థలం, రూ. కోటి ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం సంతోషమే కానీ వారిలో ఒక్క మహిళ కూడా ఎందుకు లేరని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. 'విమలక, పీవోడబ్ల్యూ సంధ్య, మా భూమి సంధ్య, బెల్లి లలిత, మల్లు స్వరాజ్యం, సదాలక్ష్మి గుర్తుకు లేదా ? అంటూ నిలదీశారు. సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం పెట్టినందున మహిళలకు నెలకు రూ.2500 ఇవ్వరా?' అని ప్రశ్నించారు. పార్టీ పిలుపు మేరకు

- మిగతా 2వ పేజీలో



## పోడు రైతుల సాగుకు సౌర విద్యుత్తు

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

అటవీ హక్కుల గుర్తింపు చట్టం(రికగ్నిషన్ ఆఫ్ ఫారెస్ట్ రైట్స్-2006) ప్రకారం పట్టాలు పొందిన పోడు రైతుల సాగుకు సౌర విద్యుత్తు(సోలార్ పవర్)ను అందిస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ప్రతి వ్యవసాయ పంపుసెట్‌కు కరెంటు ఇవ్వడానికి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజావాణిని ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా మంగళవారం ఆయన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్నారు. పోడు రైతులకు సౌర విద్యుత్తును అందించడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని గిరిజన సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రజల అవసరాలు, ఇబ్బందులను నేరుగా చెప్పుకోవడానికి ప్రభుత్వం ప్రజావాణిని ఏర్పాటు చేసిందన్నారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా ప్రజావాణి కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగిస్తామని చెప్పారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తునూ కంప్యూటరైజ్ చేసి, సంబంధిత అధికారులకు పంపిస్తూ పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చకపోగా రాష్ట్రాన్ని 70 ఏళ్ల వెనక్కి తీసుకెళ్లిందని ఆయన విమర్శించారు. కాగా, ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 424 దరఖాస్తులు వచ్చాయి.

## మోహన్‌బాబు ఇంటి వద్ద హైడ్రామా



**కూతురిని తీసుకెళ్లడానికి ఇంటికి వచ్చిన మనోజ్**

**అడ్డుకున్న సెక్యూరిటీ**

**గేట్లను తోసుకుని లోపలి**

**ఆగ్రహంతో మనోజ్,మీడియాపై దాడి చేసిన మోహన్‌బాబు!**

**మనోజ్‌కు తండ్రి వాయిస్ మెసేజ్**

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

సినీ పరిశ్రమలోని మంచు కుటుంబంలో గొడవలు రోజు రోజుకూ ముదురుతున్నాయి. మోహన్‌బాబు ఇంటి వద్ద మంగళవారం ఉదయం నుంచి రాత్రి నాటకీయ పరిణమాలు చోటుచేసుకున్నాయి. పహాడీషరీఫ్ పోలీసులు ఉదయం జల్‌పల్లిలోని మోహన్‌బాబు ఇంటికి వచ్చి అక్కడ పనిచేస్తున్న వారిని విచారించారు. ఇదిలా ఉండగా, మంచు విష్ణు విదేశాల నుంచి ఇంటికి రాగానే మోహన్‌బాబుతో కలిసి మంచు మనోజ్, అతని భార్యను ఇంటి నుంచి బయటికి పంపించినట్టు తెలిసింది. అనంతరం మంచు మనోజ్ విలేకరులతో మాట్లాడుతూ.. తనకు

- మిగతా 2వ పేజీలో

## ఇక వాట్సాప్ పాలన!

**అన్ని ప్రజా సేవలకూ వాట్సాప్ వేదిక కావాలి**

**శాఖలవారీ డ్యాష్‌బోర్డుల నిర్వహణ ఆర్టీజీఎస్‌కు**

**జనవరి 1న జనన, మరణాల నమోదుకు పోర్టల్**

**మరో వెయ్యి సచివాలయాల్లో ఆధార్ సెంటర్లు**

**ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు**




(ప్రజాతీర్పు ప్రతినిధి, అమరావతి)

సాంకేతికతను విస్తృతంగా వినియోగించుకుని సమర్థవంతమైన పాలన అందిస్తామని, భవిష్యత్‌లో వాట్సాప్ వేదికగా పరిపాలన సాగిస్తామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. మంగళవారం వెలగపూడి సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్స్‌పై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కుల ధ్రువీకరణ నుంచి, ఆదాయ

- మిగతా 2వ పేజీలో




ఓ వర్గంపై అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి వివాదాస్పద వ్యాఖ్యలు.. విచారణ చేపట్టిన 'సుప్రీం'..!

3



ఆటో డ్రైవర్‌కు రూ.10 లక్షల జీవిత బీమా.. కూతురి పెళ్లికి రూ.లక్ష సాయం.. కేజ్రీవాల్ ప్రకటన

8



అల్లు అర్జున్ దెబ్బకు బాక్సాఫీస్ షేక్.. పుష్ప 2 వసూళ్ల బీభత్సం..



# మోహన్‌బాబు ఇంటి వద్ద హైడ్రామా

(మొదటి పేజీ తరువాయి)

ఆస్తిపై ఎలాంటి ఆశా లేదని, అస్థిత్వం కోసం పోరాడుతున్నానని, తనకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు. పోలీసులు ఒకవైపే మాట్లాడటం సమంజసం కాదన్నారు. తన వెంట ఉన్న బౌన్సర్లను పంపించేసి, తనను ఇంటి నుంచి బయటికి పంపించడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. న్యాయం జరిగే వరకు ప్రపంచంలో ఎవరినైనా కలుస్తానంటూ మంచు మనోజ్ మోహన్‌బాబు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. మనోజ్ సాయంత్రం డీజీపీ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారు. డీజీపీ, ఇంటెలిజెన్స్ డీజీలను కలిసి జరిగిన ఎపిసోడ్‌ను వివరించారు. అనంతరం ఆయన నేరుగా జల్‌పల్లికి వచ్చారు. జల్‌పల్లి ఇంటి వద్ద గేట్లను మూసేయగా.. మీడియా ప్రతినిధులు బయటవేచి ఉన్నారు. డోర్లు తీయాలంటూ మనోజ్ గట్టిగా అరిచారు. అయినా ఎవరూ స్పందించలేదు. తన కూతురు ఇంట్లో ఉందని, తీసుకెళ్తానంటూ అరిచా తీయకపోవడంతో తన బౌన్సర్లతో కలిసి గేట్లను తోసుకుని లోపలికి వెళ్లిపోయారు. ఆయన వెంటనే మీడియా కూడా లోపలికి దూసుకెళ్లడంతో ప్రయివేటు బౌన్సర్లు మనోజ్‌ను, మీడియాను అడ్డుకోవడానికి ప్రయత్నించారు. అయితే, మనోజ్ వాళ్లను నెట్టేస్తూ ముందుకు సాగాడు. ఒకానొక సమయంలో ఒక బౌన్సర్ గొంతు పట్టుకున్నట్టు తెలిసింది. ఇంతలో మోహన్‌బాబు ఇంట్లో నుంచి బయటకు వస్తూ మనోజ్‌ను చూసి ఆగ్రహంతో ఊగిపోయారు. అతనిపై చేయి చేసుకుంటూ.. మీడియాను దూషిస్తూ చంపేస్తానంటూ తుపాకీ సైతం తీసినట్టు సమాచారం. మనోజ్ షర్ట్ చినిగింది. అలాగే మీడియా ముందు తిరుగుతూ కనిపించాడు. మోహన్‌బాబు ముందుకు వస్తుండగా ఒక మీడియా ప్రతినిధి ప్రశ్నించేందుకు ప్రయత్నించగా అతని చేతిలో ఉన్న టీవీ లోగో లాగి దాడి చేశారు. అంతకు ముందు అక్కడున్న బౌన్సలర్లు మీడియా ప్రతినిధులను బయటకు నెట్టేయడంతో పలువురికి గాయలయ్యాయి. పోలీసుల ఎదుటే మోహన్‌బాబు మీడియాపై దాడి చేయడంతో పరిస్థితి ఉద్రిక్తతకు దారి తీసింది. ఈ క్రమంలో మోహన్‌బాబు, మనోజ్ వద్ద ఉన్న లైసెన్స్‌డ్ తుపాకులను వెనక్కి తీసుకోవడానికి పోలీసు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. పరిస్థితి చేయి దాటిపోతుండటంతో భారీ ఎత్తున పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత్ రెడ్డి, పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి భారీ ఏర్పాటు చేశారు.

### గుండెల మీద తన్నావు.. : మోహన్‌బాబు

జల్‌పల్లిలోని మోహన్‌బాబు ఇంటి వద్ద ఉద్రిక్తత పరిస్థితుల అనంతరం మోహన్‌బాబు ఒక ఆడియోను విడుదల చేశారు. అందులో ఆయన మాట్లాడుతూ.. ”మనోజ్ నిన్ను అల్లారుముద్దుగా పెంచాను. చదువు కోసం చాలా ఖర్చు పెట్టాను. భార్య మాటలు విని నా గుండెలపై తన్నావు. తాగుడుకు అలవాటు పడి చెడు మార్గంలో వెళ్తున్నావు. కొన్ని కారణాల వల్ల ఇద్దరం ఘర్షణ పడ్డాం. ప్రతి ఇంట్లో గొడవలు ఉంటాయి. మనోజ్ నన్ను కొట్టలేదు. నా బిడ్డ నన్ను తాకలేదు. మేమిద్దరం ఘర్షణ పడ్డాం. మనోజ్ నా ఇంట్లోకి అక్రమంగా చొరబడ్డావు. ఇంట్లో అందరినీ ఎందుకు కొడుతున్నావు? బతుకుదెరువు కోసం వచ్చిన పనివాళ్లను కొట్టడం మహాపాపం. నీ దాడిలో కొందరికి గాయాలయ్యాయి. అయినా కాపాడాను. విద్యాసంస్థల్లో ప్రతిదీ లీగల్‌గా ఉంది. తప్పులు ఎక్కడా జరుగలేదు. అన్నతోపాటు వినరుని కొట్టడానికి వచ్చావు. నీ అన్నను చంపుతానని అన్నావు. మీడియాలో ఏదేదో రాస్తున్నారు.. దీని వల్ల నేను, మీ అమ్మ ఎంతో కుమిలిపోతున్నాం. జరిగిన సంఘటనతో మీ అమ్మ ఆస్పత్రిలో చేరింది. నా ఇంట్లోకి అడుగు పెట్టడానికి నీకు అధికారం లేదు. ఇది నా కష్టార్జితంతో కట్టుకున్న ఇల్లు. రోడ్డుకెక్కి నా పరువు తీశావు. ఆస్తులు ముగ్గురికి సమానంగా రాయాలా? వద్దా? అనేది నా ఇష్టం. పిల్లలకు ఇస్తానా? దానధర్మాలు చేస్తానా? అనేది నా ఇష్టం. మా నాన్న నాకు ఆస్తులు ఇవ్వలేదు. నేనే సంపాదించుకున్న. నాకు రక్షణ కావాలని పోలీసులను కోరాను. నీ కూతురిని వచ్చి తీసుకెళ్లు. నా దగ్గర వదిలిపెట్టినా ఇబ్బంది లేదు. పోలీసుల సమక్షంలోనే నీ బిడ్డను నీకు అప్పగిస్తా” అని మోహన్‌బాబు మనోజ్‌కు పంపిన వాయిస్ మెసేజ్ వైరల్ అవుతోంది.



# రామయ్య ఉత్తర ద్వార దర్శనానికి ఆన్‌లైన్ టికెట్లు

భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో 31 నుంచి ప్రారంభమయ్యే వైకుంఠ ఏకాదశి మహోత్సవాల్లో ఉత్తర ద్వార దర్శనానికి ఆన్‌లైన్ టికెట్ల సదుపాయం కల్పించినట్టు ఆలయ ఈవో రమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టికెట్ల ధరలు రూ. 2000, రూ.1000, రూ.500, రూ.250 చొప్పున నిర్ణయించినట్టు పేర్కొన్నారు.

%ప్రత్యక్షంగా ఉత్తర ద్వార దర్శనానికి హాజరుకాలేని భక్తుల సౌకర్యార్థం రూ.2000, రూ.1000తో https:// bhadradritemple. telangana.gov.in% వెబ్‌సైట్ ద్వారా బుధవారం ఉదయం 11 గంటల నుంచి బుకింగ్ సదుపాయం కల్పించామని తెలిపారు. ఆన్‌లైన్ టికెట్లు బుక్ చేసుకున్న భక్తులు 25 నుంచి జనవరి 10న ఉదయం 5 గంటల వరకు తానీషా కల్యాణ మండపంలో ఒరిజినల్ టికెట్లు పొందవచ్చని సూచించారు.

# ఆడబిడ్డలను అవమానిస్తరా?

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం ఆమె వందల మంది కార్యకర్తలు, నాయకులతో కలిసి తెలంగాణ భవన్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..తెలంగాణ ఆత్మకు ప్రతీక అయిన తెలంగాణ తల్లి రూపాన్ని మార్చి రాష్ట్ర వాంసత్వాన్ని రూపుమాపాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ అస్తిత్వాన్ని, వారసత్వాన్ని, ప్రజల భావోద్వేగాలను కేవలం జీవోతో మార్చలేరని తేల్చిచెప్పారు. తెలంగాణ తల్లి చేతిలో ఉన్న జొన్నలు, మకలు తెలంగాణకు ప్రతీక అనటాన్ని ఆక్షేపించారు. ఇతర రాష్ట్రాల్లోనూ అవి పండుతున్నప్పుడు ఈ కొత్త విగ్రహంలో ఏం ప్రత్యేకత ఉన్నదని ప్రశ్నించారు. ప్రపంచంలో మనకు మాత్రమే ప్రత్యేకమైన బతుకమ్మను తెలంగాణ తల్లి నుంచి దూరం చేశారని, ఆ స్థానంలో కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తును పెట్టి ఇదే తెలంగాణ తల్లి అనడం దారుణమని ధ్వజమెత్తారు.

### కాంగ్రెస్ తల్లిని తిరస్కరిస్తున్నాం..

‘బతుకమ్మను చేతిలో పట్టుకుని ఉన్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చి కాంగ్రెస్ తల్లిని పెట్టుకోవడం వల్ల ప్రజల మనసులు నొచ్చుకున్నాయి. సచివాలయంలో పెట్టిన కాంగ్రెస్ తల్లిని తిరసరిస్తున్నాం’ అని కవిత పేర్కొన్నారు. తెలంగాణలో ఉద్యమకారులతో పెట్టుకున్న



ఎవ్వరూబాగుపడలేదని, ఈ విషయాన్ని చంద్రబాబు నాయుడును అడిగి తెలుసుకోవాలని సీఎంకు సూచించారు.

### ఆశాల హామీలు తక్షణమే అమలు చేయాలి

ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆశా వర్కర్లను గౌరవంగా ప్రగతిభవన్‌కు పిలిపించి మాట్లాడి వారి వేతనాలను పెంచారని, ఇప్పుడు రేవంత్‌రెడ్డి వారిమీద దాష్టికం ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. ఒక పక పేదతల్లి విగ్రహాన్ని పెట్టామని చెబుతున్న సీఎం రేవంత్‌రెడ్డి ఆశా వర్కర్ల మీద దౌర్జన్యం చేశారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల, మాజీ ఎమ్మెల్యే ఆనంద్, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్లు అయాచితం శ్రీధర్, దేవీప్రసాద్, మేడే రాజీవ్‌సాగర్, పల్లె రవి, గెల్లు శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

# ఇక వాట్సాప్ పాలన!

(మొదటి పేజీ తరువాయి)


ధ్రువీకరణ వరకు.. జనన, మరణాల నమోదు నుంచి ఇతర ప్రజాసేవల వరకూ వాట్సాపను వేదికగా చేసుకునేలా వ్యవస్థలను రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. కృత్రిమ మేధ (ఏఐ), డీప్‌టెక్ వంటి సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సేవల వినియోగంతో ప్రజలకు వేగవంతమైన పరిష్కారాలు అందుతాయని చెప్పారు. శాఖల వారీగా రియల్‌టైమ్ డ్యాష్ బోర్డుల నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలను ఆర్టీజీఎసకు అప్పగిస్తామని ప్రకటించారు. మరో వెయ్యి గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. అందుకు అవసరమైన వెయ్యి ఆధార్ కిట్ల కొనుగోలుకు రూ.20కోట్లు మంజూరు చేసేందుకు సీఎం అంగీకరించారు. జవనరి 1న జనన, మరణాల నమోదుకు కొత్త పోర్టల్‌ను ప్రారంభిస్తామని చంద్రబాబు ప్రకటించారు. ఇటీవల గూగుల్ మ్యాప్‌ల ద్వారా గుర్తించిన గంజాయి తోటలను డ్రోన్ల సాయంతో ధ్రువీకరించుకున్నామని గుర్తుచేశారు. భవిష్యత్తులో పంటలకు పట్టే చీడపీడలు, తెగుళ్లు గురించి రైతులను అప్రమత్తం చేసేందుకు డ్రోన్లు వినియోగించాలని సూచించారు. అలాగే రహదారులపై జరుగుతున్న ప్రమాదాలకు గల కారణాలను అన్వేషించేందుకు డ్రోన్లు సహాయపడతాయని చెప్పారు. రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన ధాన్యం సేకరణపై రైతుల్లో సంతృప్తి వ్యక్తమవుతోందని ముఖ్యమంత్రి అధికారులకు వివరించారు. ఐవీఆర్ఎస్ ద్వారా చేపట్టిన అభిప్రాయ సేకరణలో నాణ్యతకు తగిన ధర, 48 గంటల్లోనే రైతులకు డబ్బులు జమచేయడం, రవాణా సౌకర్యం, గోనె సంచుల లభ్యతపై 90 శాతానికి పైగా రైతులు సంతృప్తి వ్యక్తం చేశారని పేర్కొన్నారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్ చివరి దశకు వచ్చిందని, ఇప్పటికే 95 శాతం కుటుంబాల జియో ట్యాగింగ్ పూర్తిచేశామని అధికారులు సీఎంకు వివరించారు. ట్యాగింగ్ సక్రమంగా జరిగిందో.. లేదో.. సరిచూసుకోవాలని చంద్రబాబు వారికి సూచించారు. రాష్ట్రంలో రూ.100 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టిన ప్రాజెక్టుల పర్యవేక్షణకు ఒకే పోర్టల్‌ను రూపొందించాలని చంద్రబాబు అధికారులకు సూచించారు. ఈ పోర్టల్‌లో కేంద్ర ప్రభుత్వ పరిధిలో చేపడుతున్న 80 ప్రాజెక్టుల సమాచారాన్ని రియల్ టైమ్‌లో అప్‌డేట్ చేయాలని చెప్పారు. రాష్ట్రంలో జనన-మరణ ధ్రువీకరణ పత్రాలు పొందడంలో తలెత్తుతున్న ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపేలా నూతన వెబ్ పోర్టల్‌ను వచ్చే ఏడాది జనవరి 1న ప్రారంభించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. పంచాయతీరాజ్, పట్టణాభివృద్ధి శాఖల సమన్వయంతో ఈ పోర్టుల్‌ను నిర్వహించాలని సూచించారు.

# ఆడబిడ్డలపై దుశ్శాసన పర్వం

(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితిని తెలుసుకొని ధైర్యం చెప్పారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అవసరమైతే మెరుగైన చికిత్స కోసం వేరే దవాఖానలో చేర్పిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రేవంత్ ప్రభుత్వం ఆదేశాలతోనే పోలీసులు మహిళలపై ఇష్టారీతిన దాడులు చేశారని విమర్శించారు. ఈ ఘటనను చూసి తెలంగాణ సమాజం సిగ్గుపడుతున్నా, హోంమంత్రిత్వ శాఖను దగ్గరపెట్టుకున్న ముఖ్యమంత్రి మాత్రం స్పందించకపోవడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. కరోనా కాలంలో ప్రాణాలకు తెగించి సేవలందించిన ఆశ కార్యకర్తలపై దాష్టీకానికి దిగడం దుర్మార్గమని మండిపడ్డారు. అధికారంలోకి రాగానే వేతనం పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించడం కాంగ్రెస్‌కే చెల్లిందని ధ్వజమెత్తారు. తెలంగాణ తల్లి పేరుతో కాంగ్రెస్ తల్లిని ప్రతిష్ఠించిన రేవంత్‌రెడ్డి తెలంగాణ తల్లులపై దాడులకు దిగడం హేయనీయమని, వారి అధినేత్రి సోనియా పుట్టినరోజు నాడే పోలీసులతో దాడులు చేయించడం బాధాకరమని పేర్కొన్నారు. ఏసీపీ, సీఐలు ఆశ కార్యకర్త చీరను లాగేయడం, వ్యాన్లలో ఎక్కించి హింసించడం చూసి రాష్ట్రంలోని ఆడబిడ్డలందరూ కలతచెందారని చెప్పారు. ఈ ఘటనపై అసెంబ్లీ సమావేశాల్లో సర్కార్‌ను నిలదీస్తామని స్పష్టంచేశారు. త్వరలోనే సీసీ ఫుటేజీలు, వీడియో ఆధారాలతో ఢిల్లీకి వెళ్లి జాతీయ మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

# బర్డ్‌ఫ్లూతో మరో మహమ్మారి!



అమెరికాలోని జంతువుల్లో హెచ్5ఎన్1 బర్డ్ ఫ్లూ వైరస్ వ్యాప్తి అత్యంత వేగంగా ఉందని, వైరస్ వ్యాప్తిని అడ్డుకోకపోతే ప్రపంచం మరో మహమ్మారిని ఎదుర్కోవాల్సి వస్తుందని సైంటిస్టులు హెచ్చరించారు. బర్డ్ ఫ్లూ వైరస్ వ్యాప్తిపై కాలిఫోర్నియాలోని ‘స్క్రిప్స్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్’ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ‘మానవుల మధ్య వైరస్ సోకిన దాఖలా ఇప్పటివరకు లేదు. అయితే ఆ పరిస్థితి ఎంతో దూరంలో లేదు. ఒకవేళ మానవుల్లో వ్యాప్తి మొదలైతే మహమ్మారిగా మారే ప్రమాదముంది. ఇప్పటివరకు ఈ వైరస్ సోకినవాళ్లలో 50 శాతం మంది మృత్యువాత పడ్డారు’ అని నిపుణులు పేర్కొన్నారు. హెచ్5ఎన్1 బర్డ్ ఫ్లూ వ్యాప్తి ఇప్పటివరకు జంతువులకే పరిమితమైంది. ఒకే ఒక్క మ్యుటేషన్ గనుక వైరస్‌లో ఏర్పడితే.. అది మానవుల మధ్య వైరస్ వ్యాప్తికి దారితీస్తుంది.

# రాజ్యసభ చైర్మెన్‌పై అవిశ్వాసం

(మొదటి పేజీ తరువాయి)

చేసిన నోటీసులను రాజ్యసభ సెక్రెటేరియట్‌కు సమర్పించారు. చైర్మెన్‌కు వ్యతిరేకం గా ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టడం దేశ పార్లమెంటరీ చరిత్రలోనే ఇది మొదటిసారి. కాగా రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మాట్లాడేందుకు లేచి నిలబడినపుడు చైర్మెన్ ఆయనకు అవకాశం ఇవ్వాలని, కానీ సభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే లేచి నిలబడగానే చైర్మెన్ మైక్రోఫోన్‌ను తరచూ కట్ చేస్తున్నారని ప్రతిపక్ష ఎంపీలు విమర్శించారు. పార్లమెంటరీ నిబంధనలు, సాంప్రదాయాల ప్రకారం సభ నడవాలని, ఈ విషయమై తాము ఫిర్యాదు చేసిన ప్రతిసారి తమను ఛాంబర్‌లోకి పిలిచి సర్దుబాటు చేసేందుకు చైర్మెన్ ప్రయత్నిస్తున్నారే తప్ప నిబంధనలను పాటించాలని భావించడం లేదని తెలిపారు. ఈ సమావేశాల్లో అవిశ్వాస తీర్మానానికి ఆమోదం లభించడం సాంకేతికంగా సాధ్యం కాదని, 14 రోజుల నోటీస్ పీరియడ్ ఉండాలని, శీతాకాల సమావేశాలు ముగియడానికి ఇప్పుడు కేవలం ఎనిమిది రోజులే ఉందని అధికార పార్టీకి చెందిన వారు చెబుతున్నారు.

### అదానీపై చర్చకు భయపడుతున్న బీజేపీ

అదానీ అంశంపై చర్చకు బీజేపీ భయపడుతోందని ఎంపీ ప్రియాంక గాంధీ అన్నారు. ఉభయ సభలు నేటికి వాయిదా పడిన అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. ”నేను పార్లమెంటుకు కొత్త సభ్యురాలిని. ఇప్పటి వరకు పార్లమెంటులో ప్రధాన మంత్రి కనిపించ లేదు. మనం ఈ అంశాన్ని ఎందు కు లేవనెత్తకూడదు?” అని అన్నారు. మరోపక్క పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో వాయిదాల పర్వం కొనసాగుతోంది. మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ఉభయ సభలు అదానీ వ్యవహారంపై ప్రతిపక్ష ఎంపీల ఆందోళనతో మధ్యా హ్నం 12 గంటలకే వాయిదా పడ్డాయి. తిరిగి ప్రారం భమైనా ఎలాంటి మార్పు లేకపోవడంతో నిమి షాల వ్యవధిలోనే బుధవారానికి వాయిదా పడ్డాయి.

# కార్తీక మాస శివ దీక్షా విరమణ ప్రారంభం..!

శ్రీశైల మహాక్షేత్రంలో బుధవారం (11.12.2024) నుంచి కార్తీక మాస శివదీక్షా విరమణ కార్యక్రమం ప్రారంభం కానున్నది. ఐదు రోజుల పాటు ఈ దీక్షా విరమణ కొనసాగుతుంది. ఈ నెల 15న శివ దీక్షా విరమణ ముగుస్తుంది. పాతాళ గంగ మార్గంలోని శివదీక్షా శిబిరాల్లో ఈ దీక్షా విరమణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు శ్రీశైలం దేవస్థానం ఈఓ శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత నెల రెండో తేదీన శివ మండల దీక్ష, 21న అర్ధ మండల దీక్ష స్వీకరించిన భక్తులు ఈ దీక్షా విరమణ సమయంలో దీక్ష విరమించవచ్చునని శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ దీక్షా విరమణ సందర్భంగా బుధవారం ఉదయం 7.30 గంటలకు స్వామి ఆలయ దక్షిణ ద్వారం వద్ద స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పల్లకిలో ఆశీసులను చేయించి విశేష పూజలు నిర్వహిస్తారని వెల్లడించారు. తర్వాత స్వామి అమ్మవార్లను రథవీధిలో మంగళవాయిద్యాల నడుమ వేద మంత్రాలతో ఊరేగింపుగా తీసుకుని వెళ్లి శివదీక్షా శిబిరాల్లో వేంచేబు చేయించడం జరుగుతుందన్నారు. అధిక సంఖ్యలో దీక్షా విరమణ చేసే భక్తుల కోసం మూడు వంతులుగా సిబ్బందికి శివ దీక్షా శిబిరాల్లో ప్రత్యేక విధులు కేటాయించారు.

# రాహుల్‌కు రాం రాం



ఇండియా కూటమిలో నాయకత్వ లొల్లి ముదురుతున్నది. ఇటీవలి హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల్లో దారుణ ఓటమితో కాంగ్రెస్, రాహుల్ గాంధీ నాయకత్వ పటిమపై కూటమి పార్టీల్లో నమ్మకం సడలింది. హస్తం పార్టీ నేతృత్వంలో బీజేపీని ఎదుర్కోవడం కష్టమే అనే భావనకు ప్రతిపక్ష కూటమి పార్టీలు వచ్చేశాయి. ఇంకా కాంగ్రెస్, రాహుల్ గాంధీ నాయకత్వంలో నడిస్తే తామూ మునిగిపోతామని ఆయా పార్టీల నేతలు మథనపడుతున్నారు. ప్రత్యామ్నాయంగా మమతా బెనర్జీ నాయకత్వానికి జై కొడుతున్నారు. అవకాశం ఇస్తే ఇండియా కూటమిని నడిపిస్తానని మమత చేసిన వ్యాఖ్యలకు కూటమి పార్టీల నుంచి అనూహ్య మద్దతు లభిస్తున్నది. ఇప్పటికే సమాజ్‌వాదీ పార్టీ, ఎన్సీపీ(శరద్‌చంద్ర పవార్), శివసేన(యూబీటీ) నాయకులు మమత నాయకత్వాన్ని ఆహ్వానించారు. ఇండియా కూటమి పగ్గాలు ఆమెకు అప్పగించాలనే డిమాండ్‌ను వినిపించారు. తాజాగా ఈ జాబితాలో ఆర్జేడీ కూడా చేరింది. ఇండియా కూటమి నాయకత్వంపై ఆర్జేడీ అధినేత, బీహార్ మాజీ సీఎం లాలూప్రసాద్ యాదవ్ మంగళవారం కీలక వ్యాఖ్యలు చేశారు. 'మమతా బెనర్జీకి మేము మద్దతు ఇస్తాం. ఇండియా కూటమికి నాయకత్వం వహించడానికి ఆమెకు అనుమతి ఇవ్వాలి' అని ఆయన వ్యాఖ్యానించారు. మమత నాయకత్వానికి కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేస్తుందా? అని ఆయనను ప్రశ్నించగా.. కాంగ్రెస్ వ్యతిరేకించడం సమస్యేమీ కాదని ఆయన కుండబద్దలు కొట్టారు. మరోవైపు ఆర్జేడీ కీలక నేత, లాలూ కుమారుడు తేజస్వీ యాదవ్ సైతం ఇండియా కూటమిని మమత నడిపించడానికి తమకేమీ అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. అయితే, ఈ నిర్ణయం ఏకాభిప్రాయం ద్వారానే జరగాలని ఆయన పేర్కొన్నారు. మరోవైపు ఇంతకాలం ఇండియా కూటమి, ఎన్డీఏలో లేకుండా తటస్థంగా ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సైతం మమతా బెనర్జీకి మద్దతు తెలపడం ఆసక్తికరంగా మారింది. ఇండియా కూటమికి నాయకత్వం వహించేందుకు మమత సరైన వ్యక్తి అని, 42 లోక్‌సభ స్థానాలు కలిగిన పెద్ద రాష్ట్రానికి ఆమె ముఖ్యమంత్రి అని, ఎన్నికల్లో ఆమె తన సామర్థ్యాన్ని నిరూపించుకున్నారని వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఇండియా కూటమిలోని పార్టీల మద్దతుతో తృణమూల్ కాంగ్రెస్ సైతం స్వరం పెంచింది. కాంగ్రెస్ పార్టీ తన అహాన్ని పక్కన పెట్టి ఇండియా కూటమి నాయకత్వాన్ని మమతా బెనర్జీకి అప్పగించాలని టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ డిమాండ్ చేశారు. 'కాంగ్రెస్ నాయకత్వంలో ఇండియా కూటమి విఫలమైందని ఆ పార్టీ అర్థం చేసుకోవాలి. మమతకు రాజకీయ యుద్ధాల్లో ఎలా పోరాడాలో తెలుసు. కాంగ్రెస్ పార్టీ తన అహంతో మమతను వదులుకున్నది. ఇప్పుడు ఆమె ఎలా రాజకీయాల్లో రాణిస్తున్నారో చూస్తున్నాం. మమతకు ఇండియా కూటమి నాయకత్వాన్ని అప్పగిస్తే చాలా మేలు' అని ఆయన పేర్కొన్నారు. ఇండియా కూటమిలో తమ నాయకత్వానికి ఎసరు వస్తుండటంతో కాంగ్రెస్ పార్టీ ఇరకాటంలో పడింది. దీంతో మమతా బెనర్జీపై ఎదురు దాడిని ప్రారంభించింది. మమతకు ఇండియా కూటమి నాయకత్వం అప్పగించాలనే సూచనను 'జోక్'గా కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాగూర్ అభివర్ణించారు. బెంగాల్ బయట తృణమూల్ కాంగ్రెస్ ఎలాంటి ఫలితాలను సాధించిందని ఆయన ప్రశ్నించారు. గోవా, త్రిపుర, మేఘాలయ, అస్సాం, నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్ లో ఏం సాధించిందో తృణమూల్ స్పష్టత ఇవ్వాలని పేర్కొన్నారు.

## ఆటో డ్రైవర్‌కు రూ.10 లక్షల జీవిత బీమా.. కూతురి పెళ్లికి రూ.లక్ష సాయం.. కేజ్రీవాల్ ప్రకటన



ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్నాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఎన్నికలు జరగనున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అధికార ఆప్ దూకుడు పెంచింది. అసెంబ్లీ ఎన్నికల కోసం ఇప్పటికే రెండు విడతల్లో మొత్తం 31 మంది అభ్యర్థులను కూడా ప్రకటించిన విషయం తెలిసిందే. ఇక ఆప్ అధినేత కేజ్రీవాల్ అన్ని వర్గాల ప్రజలను తనవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలోనే సోమవారం సాయంత్రం ఢిల్లీలోని తన నివాసంలో ఆటో డ్రైవర్లకు తేనేటి విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఓ ఆటో డ్రైవర్ కేజ్రీని భోజనానికి ఇన్వైట్ చేశారు. ఆయన ఆహ్వానం మేరకు ఇవాళ ఓ ఆటో డ్రైవర్ ఇంట్లో కేజ్రీ లంచ్ చేశారు. తన సతీమణి సునీతతో కలిసి తన ఇంటికి వచ్చిన కేజ్రీవాల్‌కు ఆటో డ్రైవర్ కుటుంబం ఘనంగా స్వాగతం పలికింది. ఈ సందర్భంగా అక్కడ కేజ్రీ లంచ్ చేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లకు కేజ్రీవాల్ వరాల జల్లు కురిపించారు. ఆటో డ్రైవర్ల కోసం ఐదు హామీలు ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలోకి రాగానే ఆటో డ్రైవర్ కూతురి పెళ్లికి రూ.లక్ష సాయం ఇస్తామని తెలిపారు. అదే విధంగా ప్రతి దీపావళి, హోలీకి రూ.2,500, ఒక్కో ఆటోడ్రైవర్‌కు రూ.10 లక్షల జీవిత బీమా, రూ.5 లక్షల ప్రమాద బీమా కల్పిస్తామని వెల్లడించారు. ఆటో డ్రైవర్ల పిల్లల పోటీ పరీక్షలకు సంబంధించిన ఫీజులు ప్రభుత్వమే చెల్లిస్తుందని హామీ ఇచ్చారు.

## అమెరికా సివిల్ రైట్స్ అటార్నీగా హర్మీత్ దిల్లాన్



అమెరికా న్యాయశాఖకు చెందిన పౌర హక్కుల విభాగానికి అసిస్టెంట్ అటార్నీ జనరల్‌గా భారతీయ సంతతి వ్యక్తి హర్మీత్ కే థిల్లాన్ ను నియమించారు డోనాల్డ్ ట్రంప్. కాబోయే అధ్యక్షుడిగా ఎన్నికైన ట్రంప్ తనకు చెందిన ట్రుత్ సోషల్ మీడియాలో ఈ విషయాన్ని ప్రకటించారు. తన కెరీర్ మొత్తం పౌరల హక్కుల కోసం హర్మీత్ పోరాడినట్లు ఆయన పేర్కొన్నారు. దేశంలోని టాప్ ఎన్నికల న్యాయవాదిగా కూడా ఆమెకు గుర్తింపు ఉన్నది. లీగల్ ఓట్లను మాత్రమే లెక్కించాలని ఆమె పోరాటం చేశారు. డార్ట్‌మౌత్ కాలేజీలో ఆమె గ్రాడ్యుయేషన్ చేశారు. యూనివర్సిటీ ఆఫ్ వర్జీనియా లా స్కూల్ నుంచి ఆమె పట్టా పొందారు. యూఎస్ ఫోర్త్ సర్క్యూట్ కోర్ట్ ఆఫ్ అప్పీల్స్‌లో ఆమె క్లర్క్‌గా చేశారు. సిక్కు మతవర్గీయుల్లో హర్మీత్‌కు గౌరవప్రదమైన గుర్తింపు ఉన్నట్లు ట్రంప్ తన ట్వీట్‌లో తెలిపారు. రాజ్యాంగపరమైన హక్కులను పరిరక్షించేందుకు ఆమె అవిశ్రాంత పోరాటం చేయనున్నట్లు చెప్పారు. దిల్లాన్ చండీఘడ్‌లో జన్మించారు. చిన్నతనంలోనే ఆమె పేరెంట్స్‌తో కలిసి అమెరికా వలసవెళ్లారు. క్లీవ్‌లాండ్‌లో జరిగిన ఇండియన్ అమెరికన్ జీవోపీ కన్వెన్షన్‌లో ఆమె తొలిసారి ప్రసంగించారు. ఆ మీటింగ్ అర్దాస్ చదివినందుకు ఆమెపై వర్ణవివక్ష దాడి జరిగింది.

## కుటుంబంలో ఎంత మంది ఉన్నా వర్తింపు ఆయుష్మాన్‌భవ!

70 ఏండ్లు, అంతకన్నా ఎక్కువ వయసు కలిగిన వృద్ధులకు కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఆయుష్మాన్ భారత్' పథకం ఓ ఆరోగ్య సంజీవనిగా మారింది. 2018లో తీసుకొచ్చిన ఈ పథకం ప్రయోజనాలను 70 ఏండ్లు పైబడిన వృద్ధులకు కూడా వర్తింపజేసేలా ఇటీవలే మార్పులు చేశారు. తాజా నిర్ణయంతో దేశంలోని 4.5 కోట్ల కుటుంబాల్లో ఉన్న సుమారు 6 కోట్ల మంది వృద్ధులకు లబ్ధి చేకూరే వెసులుబాటు కలిగింది. ఈ నేపథ్యంలో ఆయుష్మాన్ భారత్ సీనియర్ సిటిజన్ ఆరోగ్య బీమా (ఏబీపీఎంజేఏవై-సీనియర్ సిటిజన్) పథకంపై సమగ్ర వివరాలు.. దేశంలో 70 ఏండ్లు, ఆపైబడిన వయసు వారందరికీ రూ.5 లక్షల ఉచిత వార్షిక ఆరోగ్య బీమా కవరేజీ ఇవ్వడమే ఏబీపీఎంజేఏవై-సీనియర్ సిటిజన్ స్కీమ్ లక్ష్యం. ఈ పథకంలో చేరడానికి ఆర్థిక స్థోమత, సామాజిక స్థితి, వృత్తి ఇలా ఏ అంశాలనూ పరిగణనలోకి తీసుకోరు. 70 ఏండ్ల వయసు పైబడిన పురుషుడు, మహిళ ఎవరైనా ఈ పథకంలో చేరొచ్చు. వయసు ధ్రువీకరణ కొరకు ఆధార్ కార్డు ఒక్కటి ఉంటే చాలు. మరే ఇతర పత్రాలు అవసరం లేదు. ష్ట్రజూం://ఎవఅవటఱ-ఎఖుతీఎ. అష్ఖు.ప్రశీజ.ఱఅ పోర్టల్ ద్వారా పీఎంజేఏవై పథకానికి దరఖాస్తు చేయవచ్చు. ఆండ్రాయిడ్ యూజర్లు ఆయుష్మాన్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని దరఖాస్తు చేసుకోవచ్చు. పథకంలో చేరినవారికి ప్రత్యేకంగా ఆయుష్మాన్ వయ వందన కార్డును అందజేస్తారు. డిజిటల్ కార్డులూ అందుబాటులో ఉన్నాయి. ఒకే కుటుంబంలో ఒకరి కన్నా ఎక్కువ మంది అర్హులు ఉంటే, మొదటి వ్యక్తి వివరాలను ముందుగా నమోదు చేయాలి. ఆ తర్వాత 'యాడ్ మెంబర్'పై క్లిక్ చేసి మరొకరి వివరాలను నమోదు చేయాలి. ఒక్కొక్కరికి వేర్వేరుగా నమోదు చేయనక్కర్లేదు. ఒకే కుటుంబంలో ఒకరి కన్నా ఎక్కువ మంది అర్హులైన వృద్ధులు ఉంటే, వారంతా కలిసి రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్స పొందవచ్చు. ఉదాహరణకు ఒక కుటుంబంలో ఇద్దరు వృద్ధులు ఉంటే వారికి సగం, సగం ప్రయోజనం చేకూరుతుంది. అంటే, కుటుంబానికి రూ.5 లక్షల వరకు మాత్రమే లబ్ధి పొందడానికి వీలవుతుందన్న మాట. ఇప్పటికే ఆయుష్మాన్ పథకం వర్తిస్తున్న కుటుంబాల్లో 70 ఏండ్లు, ఆ పైబడిన వారుంటే.. వారికి అదనంగా ఏడాదికి రూ.5 లక్షల బీమా సౌకర్యం లభిస్తుంది. నవంబర్ 1 వరకు ఉన్న డాటా ప్రకారం.. దేశవ్యాప్తంగా 16,691 ప్రభుత్వ దవాఖానలు, 13,078 ప్రైవేటు దవాఖానలు ఈ పథకం కింద నమోదయ్యాయి. ప్రభుత్వ ఆరోగ్య బీమా పథకం నుంచి వైదొలగి, ఏబీపీఎంజేఏవైలో చేరినవారు మళ్లీ ఆ ప్రభుత్వ ఆరోగ్య పథకానికి వెనక్కి మారడానికి వీలుండదు. ఏబీపీఎంజేఏవైలోనే కొనసాగాల్సి ఉంటుంది. ప్రైవేటు వైద్య ఆరోగ్య బీమా, కార్మిక రాజ్య బీమా (ఈఎస్ఐ) పథకం కింద ప్రయోజనం పొందుతున్న వారు వాటిని కొనసాగిస్తూనే ఈ పథకంలోనూ చేరొచ్చు. అలా అదనంగా రూ.5 లక్షల ఆరోగ్య బీమా ప్రయోజనం పొందొచ్చు. పీఎంజేఏవై పథకంలో చేరిన మొదటి రోజు నుంచే చికిత్స పొందడానికి అర్హులు. చికిత్స కోసం వెయిటింగ్ పీరియడ్ నిబంధన లేదు. కాబట్టి ఈ బీమా కవరేజ్ తక్షణమే ప్రారంభమవుతుంది. డయాలిసిస్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్, బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్, ఆర్థోపెడిక్ సర్జరీల వంటి 1,949 మెడికల్ ప్రొసీజర్లు, జనరల్ మెడిసిన్, సర్జరీ, ఆంకాలజీ, కార్డియాలజీ వంటి 27 మెడికల్ స్పెషాలిటీలతో పాటు 750కి పైగా అరుదైన చికిత్సలు ఈ పథకం కింద అందుబాటులో ఉన్నాయి. ఈ పథకం పూర్తిగా నగదు రహితమైనది. స్కీమ్ కవరేజీ కలిగిన ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానలో పేరును నమోదు చేసుకొని ఒక్క పైసా కూడా చెల్లించకుండా వైద్య సేవలను పొందొచ్చు. ఏదైనా చికిత్స కోసం దవాఖానలో చేరే అవసరం ఏర్పడితే, మూడు రోజుల ప్రీ-హాస్పిటలైజేషన్ (కన్సల్టెన్సీ ఫీజు, టెస్టులు)తో పాటు 15 రోజుల పోస్ట్-హాస్పిటలైజేషన్ ఖర్చులు కూడా ఈ స్కీమ్ పరిధిలోకే వస్తాయి. సీజీహెచ్ఎస్, ఎక్స్‌సర్వీస్‌మెన్ కంట్రిబ్యూటరీ హెల్త్‌స్కీమ్, ఈసీహెచ్ఎస్, ఆయుష్మాన్ సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ (సీఏపీఎఫ్) పథకాల కింద ఉన్న వయో వృద్ధులు వాటిని కానీ, ఏబీపీఎంజేఏవైని కానీ ఏదైనా ఒకటి ఎంచుకోవచ్చు.

## ఎస్ఎం కృష్ణ కన్నుమూత అనారోగ్యంతో తుదిశ్వాస



కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, మాజీ విదేశాంగ మంత్రి ఎస్ఎం కృష్ణ కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం బెంగళూరులో తుదిశ్వాస విడిచారు. 92 ఏండ్ల ఎస్ఎం కృష్ణ.. కేంద్ర, రాష్ట్ర రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బుధవారం ఆయన సొంత జిల్లా మండ్యలో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు జరగనున్నాయి. ఎస్ఎం కృష్ణ మృతికి ప్రధాని నరేంద్ర మోదీ, ఆయన క్యాబినెట్ సహచరులు ఎస్ జైశంకర్, నిర్మలా సీతారామన్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తదితరులు సంతాపం ప్రకటించారు. కర్ణాటక సర్కారు మూడు రోజులు సంతాప దినాలుగా ప్రకటించింది. మృదుభాషి, ఉన్నతి విద్యావంతుడైన సోమవనహళ్లి మల్లయ్య కృష్ణ 1962లో కర్ణాటకలోని మద్దూర్ నుంచి స్వతంత్ర ఎమ్మెల్యేగా గెలుపొంది 30 ఏండ్లకే అసెంబ్లీలో అడుగుపెట్టారు. అనంతర కాలంలో కాంగ్రెస్‌లో చేరి రాష్ట్ర ముఖ్యమంత్రిగా, విదేశీ వ్యవహారాల మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. బెంగళూరును ఐటీ హబ్‌గా తీర్చిదిద్దడంలో కృష్ణ పాత్ర ఎనలేనిదని ఐటీ రంగ నిపుణులు చెబుతారు. 1968లో సోషలిస్టు ఎంపీగా 4వ లోక్‌సభలోకి మొదటిసారి అడుగుపెట్టారు. 1972లో ఆయన రాష్ట్ర రాజకీయాలకు తిరిగిరావలసి వచ్చింది. 1980లో మళ్లీ లోక్‌సభలోకి అడుగుపెట్టిన కృష్ణ 1983-84లో కేంద్ర పరిశ్రమల శాఖ సహాయ మంత్రిగా, 1984-85లో ఆర్థిక శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. తర్వాత కర్ణాటక అసెంబ్లీ స్పీకర్‌గా, ఉప ముఖ్యమంత్రిగా రాజ్యసభ సభ్యునిగా, కర్ణాటక ముఖ్యమంత్రిగా ఆయన పనిచేశారు. అనంతరం మహారాష్ట్ర గవర్నర్‌గా, విదేశాంగ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2017లో బీజేపీలో చేరిన కృష్ణ 2023లో రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకున్నారు. అప్పట్లో అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసిన డెమోక్రాట్ అభ్యర్థి జాన్ ఎఫ్ కెనడీ కోసం కృష్ణ ప్రచారం చేశారు. ఆ ఎన్నికల్లో గెలుపొందిన కెనడీ భారతీయుల ఓట్లు తనకు లభించేందుకు కృష్ణ చేసిన కృషిని కొనియాడారు.

## పుతిన్‌కు నేనంటే భయం.. ఈ విషయం ట్రంప్‌తో చెప్పా : జెలెన్‌స్కీ



రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు తానంటే భయమని, ఇదే విషయాన్ని తాను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో చెప్పానని ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ తెలిపారు. పుతిన్ తనకు, అమెరికాకు మాత్రమే భయ పడతాడని జెలెన్‌స్కీ పేర్కొన్నాడు. ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్‌తో సమావేశమైన విషయాన్ని జెలెన్‌స్కీ సోషల్ మీడియాలో వెల్లడించారు. ట్రంప్ రష్యా, ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించాలనే బలమైన సంకల్పంతో ఉన్నారని, అందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని జెలెన్‌స్కీ పేర్కొన్నారు. యుద్ధానికి ముగింపు ఎలా పలుకాలనే విషయంపై తామంతా కలిసి పనిచేస్తున్నామని తెలిపారు. పారిస్‌లో జరిగిన త్రైపాక్షిక సమావేశంలో ఈ అంశంపైనే ప్రధానంగా చర్చించామని వెల్లడించారు. పుతిన్ తనకు, అమెరికాకు మాత్రమే భయపడుతాడని అన్నారు. త్రైపాక్షిక సమావేశం ఏర్పాటు చేసిన మేక్రాన్‌కు జెలెన్‌స్కీ కృతజ్ఞతలు తెలిపారు. మూడేళ్లుగా రష్యాతో సాగుతున్న యుద్ధం కోసం బైడెన్ సర్కారు తమకు ఆర్థిక, ఆయుధ సాయం అందిస్తోందని చెప్పారు. అమెరికా నుంచి ఉక్రెయిన్‌కు ఇప్పటివరకు 62 బిలియన్ డాలర్ల ఆయుధాలు అందాయి.

## ఓ వర్గంపై అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి వివాదాస్పద వ్యాఖ్యలు.. విచారణ చేపట్టిన 'సుప్రీం'..!



లహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ వివాదాస్పద వ్యాఖ్యలను సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకొని విచారణ చేపట్టింది. ఆయన ప్రసంగంపై అలహాబాద్ హైకోర్టును సమాచారం ఇవ్వాలని ఆదేశించింది. విశ్వహిందూ పరిషత్ లీగల్ సెల్ ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో జస్టిస్ శేఖర్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఓ వర్గంపై చేసిన వ్యాఖ్యలపై వివాదం చెలరేగింది. జ్యుడీషియల్ అకౌంటబిలిటీ అండ్ రిఫార్మ్స్ (%జజీూ=%) అనే సంస్థ సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నాకు లేఖ రాసింది. హైకోర్టు జడ్జిపై అంతర్గత విచారణ జరపాలని సంస్థ కన్వీనర్ ప్రశాంత్ భూషణ్ డిమాండ్ చేశారు. ఆయన న్యాయనైతికత, రాజ్యాంగ సూత్రాలను ఉల్లంఘించారని ఆరోపించారు. ఓ వర్గాన్ని కించపరిచే పదాలను సైతం ఉపయోగించారని లేఖలో ప్రస్తావించారు. వ్యాఖ్యలతో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి పదవికి, న్యాయవ్యవస్థకు చెడ్డపేరు వచ్చిందన్నారు. ఉమ్మడి పౌరస్మృతిపై వీహెచ్‌పీ లీగల్ సెల్ నిర్వహించిన ఓ కార్యక్రమంలో జస్టిస్ శేఖర్ యాదవ్ పాల్గొన్నారు. మెజారిటీ ప్రజల ఆకాంక్షల మేరకు హిందుస్థాన్ నడుస్తుంది తప్పా.. నలుగురిని పెళ్లి చేసుకునే హక్కు ఉంది.. హలాలా చేస్తాం.. ట్రిపుల్ తలాఖ్ ఇస్తాం.. అందుకు మా పర్సనల్ లా అంగీకరిస్తుందని అనలేరని.. ఆ హక్కులు ఇక్కడ పని చేయవంటూ వ్యాఖ్యానించారు. ఆయన తన ప్రసంగంలో కఠ్‌ముల్లా (మూఢ ముస్లిం) అనే పదాన్ని సైతం వాడారు. యూసీసీ అంటే అది వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్‌లకు సంబంధించిన విషయం కాదని.. దేశ సర్వోన్నత న్యాయస్థానం సైతం దీని గురించి మాట్లాడిందన్నారు. కఠ్‌ముల్లాలు అనే మాట అనడం సరైంది కాకపోవచ్చుని.. కానీ, అనేందుకు తాను సంకోచించనన్నారు. ఎందుకంటే వారు దేశానికి ప్రమాదకరమని.. వ్యతిరేకమన్న ఆయన.. వారితో జాగ్రత్తగా ఉండాలని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి. న్యాయమూర్తిగా ఉన్న ఆయన.. ఇలాంటి వ్యాఖ్యలు చేయడేంటని ప్రశ్నిస్తున్నారు.



## తెలంగాణ తల్లి విగ్రహం మార్పు కాదు

### ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

### మాజీ జెడ్పిటిసి సభ్యుడు వంగ రవీందర్

**భీమదేవరపల్లి డిసెంబర్ 10 (( ప్రజా తీర్పు విలేఖరి )**

గత ప్రభుత్వం చేపట్టిన పథకాలు, విగ్రహ మార్పులు కాదు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని భీమదేవరపల్లి మాజీ జెడ్పిటిసి సభ్యుడు వంగ రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం నాడు హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద గత ప్రభుత్వం రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహానికి టిఆర్ఎస్ నేతలు పాలాభిషేకం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ జెడ్పిటిసి సభ్యుడు వంగ రవీందర్ మాట్లాడుతూ గత టిఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో అన్ని వర్గాలను ఆదుకున్నదని అన్నారు. మాయమాటలు చెప్పి, అమలు కానీ హామీలన్నీ ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఆయన ఆరోపించారు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని లేకుంటే ప్రజా ఉద్యమాలు తప్పని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు మండల సురేందర్, జక్కుల అనిత, మాడుగుల అశోకు, మాడిశెట్టి కుమార్ స్వామి గుడి కందుల రాజు, కండి చిరంజీవి, సదానందం తదితరులు పాల్గొన్నారు



## బొమ్మ వెంకన్న విగ్రహ ప్రతిష్టాపనకు తరలి వెళ్లిన భీమదేవరపల్లి వాసులు

**భీమదేవరపల్లి, డిసెంబర్ 10 ( ప్రజా తీర్పు విలేఖరి )**

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండల కేంద్రంలో స్వర్గీయ ఇందుర్తి మాజీ శాసనసభ్యులు బొమ్మ వెంకన్న విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి భీమదేవరపల్లి మండలం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, మున్నూరు కాపు సంఘం నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. బొమ్మ వెంకన్న న్యాయవాదిగా, కాంగ్రెస్ పార్టీ వాదిగా, తన జీవితకాలం పనిచేయడం గొప్ప విషయ మనీ ఆయన సిద్ధాంతాలను కొనసాగిస్తున్న బొమ్మ శ్రీరామ్ కు భవిష్యత్తులో భీమదేవరపల్లి మండలంలో నీ మున్నూరు కాపు కులస్తులు అందరూ అండగా ఉంటారని వారు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని నాయకులు కొలుగూరి రాజు, ఆదరి రవీందరు చంద్రశేఖర్ గుప్తా, చిదర సుధాకర్ లతోపాటు వందలాది మంది కార్యకర్తలతో పాటు మున్నూరు కాపు కులస్తులు తరలి వెళ్లారు.

## చెస్ విజేతలను అభినందించిన పోలీస్ కమిషనర్ మహంతి

**( వకుళాభరణం భానుప్రకాష్**
**ప్రజాతీర్పు బ్యూరో కరీంనగర్ డిసెంబర్ 10)**

చదరంగ క్రీడలో జాతీయ, అంతర్జాతీయస్థాయి పోటిల్లో పాల్గొని పతకాలు సాధించిన జిల్లా చదరంగ క్రీడాకారులను పోలీస్ కమీషనర్ అభిషేక్ మహంతి తన కార్యాలయంలో సోమవారం అభినందించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని నర్మదాపురంలో జరిగిన 68వ జాతీయస్థాయి పాఠశాలల అండర్ 17 చెస్ పోటిల్లో సుప్రీత్ రజత పతకం సాధించగా సింగపూర్‌లో జరిగిన జాతీయస్థాయి అండర్ 16 స్కూల్ గేమ్స్ లో మేఘసంహిత కాంస్య పతకం సాధించింది. ఈ సందర్భంగా క్రీడాకారులను సీపీ అభినందించి మాట్లాడారు. ఇటీవలీ కాలంలో వరల్డ్ చెస్ చాంపియన్ షిప్ పోటిల్లో భారత క్రీడాకారులు అద్భుతంగా రాణిస్తున్నారన్నారు. అర్జున్, గుకేష్, ప్రజ్ఞానందలు ప్రపంచ చాంపియన్‌లుగా నిలుస్తున్నారని వారిని ఆదర్శంగా తీసుకొని ప్రపంచ స్థాయికి ఎదుగాలని సూచించారు. అదే విధంగా జాతీయస్థాయి లో పతకాలు సాధించేలా తీర్చిదిద్దిన జీనీయస్ అకాడమీ వ్యవస్థాపకులు కంకటి కనుకయ్య, కోచ్ కంకటి అనూప్ కుమార్‌లను సీపీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సుప్రీత్ తల్లిదండ్రులు కేశవేణి స్వరూప మహేందర్, మేఘసంహిత తల్లిదండ్రులు శ్రీలత చక్రవర్తి, అకాడమీ కోచ్ లు అనూష్, అభిరామ్, సృజన్, తరుణ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



# మహనీయుల విగ్రహాల ముసుగులు తొలగించండి

### తిమ్మాపూర్ మండల జేఏసీ నాయకుల డిమాండ్

### ఎమ్మార్వో, జిల్లా కలెక్టర్‌కు వినతి

**( ప్రజాతీర్పు బ్యూరో కరీంనగర్ డిసెంబర్ 10 )**



కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ ముందు గత రెండేళ్ల క్రితం ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేడ్కర్, మాజీ ఉప ప్రధాని బాబుజగ్జీవన్ రమ్ విగ్రహాలపై ఉన్న ముసుగులను వెంటనే తొలగించాలని తిమ్మాపూర్ మండల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు . ఈ మేరకు తిమ్మాపూర్ మండల ఎమ్మార్వోకు, ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కు తిమ్మాపూర్ జేఏసి నాయకులు పిర్యాదు చేశారు. గత రెండేళ్ల క్రితం మండల కేంద్రం లో ఏర్పాటు చేసిన విగ్రహాలను ఆవిష్కరించకుండా ముసుగులు వేసి ఉంచారని, దాదాపు రెండు సంవత్సరాలు గడిచిపోయిన ముసుగులు తొలగించని పరిస్థితి ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య ఏర్పడిన కొన్ని అనివార్య కారణాల వల్ల వచ్చిన సమాచారం లోపంతో మహనీయుల విగ్రహాలు ఆవిష్కరణ కు నోచుకోవడం లేదని పిర్యాదు లో పేర్కొన్నారు. ఈ విషయమై గత ప్రభుత్వంలో ఉన్న మంత్రి, ఎమ్మెల్యే,సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకు వెళ్ళినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.మహనీయుల విగ్రహాలను నెలకోల్పినప్పటికి వాటిని ఆవిష్కరించకుండా సంబంధిత అధికారులు ఒక విధంగా ప్రజాస్వామ్య వాదుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. ఆవిష్కరణకు నోచుకో కుండా ఉండటం తో ముసుగులను తొలగించాలని నిరసనలు చేస్తే, నిరసనకారులను అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నారని , బందోబస్తు పెట్టి మరీ ముసుగులు తొలగించకుండా చేస్తున్నారన్నారు. ప్రజలు తమ ఆరాధ్య దైవంగా భావించే డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ , బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకున్న ముసుగులను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని జేఏసీ నాయకులు కోరారు. కార్యక్రమంలో జేఏసి కన్వీనర్ లు మాతంగి శంకర్, దుండ్ర రాజయ్య,బోయిని తిరుపతి,వంతడుపుల సంపత్, అంబాల సతీష్, పార్నాంది జలపతి, తీన్మార్ మల్లన్న కమిటీ సభ్యులు అఖిల్ పాషా, ఖమ్మం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.




## కుబీర్ వాసికి భారత్ సేవ పురాస్కర్ అవార్డు

**(ప్రజాతీర్పు జిల్లాప్రతినిధి నిర్మల్ డిసెంబర్ 10)**

75 వ ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మంగళవారం" హైదరాబాద్ లోని తెలంగాణ సారస్వత పరిషత్ సరస్వతి కళ భవనము నందు కుబీర్ గ్రామానికి చెందిన డాక్టర్ సాప పండరికి భారత్ సేవ పురాస్కర్ అవార్డు లభించింది. డాక్టర్ సాప పండరి గత కొంతకాలంగా సమాజంలోచేస్తున్న పలు సామాజిక సేవలను గుర్తించి సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ కౌన్సిల్ వారి ఆధ్వర్యంలో భారత్ సేవ పురస్కార్"""అవార్డు ను ను ఫార్మర్ నేషనల్ ఎస్సీ కమిషన్ నెంబర్ కె.రాములు, మాజీ బిసి కమిషన్ చైర్మన్ బి.ఎస్.రాములు,డాక్టర్ హిప్నో పద్మ కమలాకర్, (ఎస్ జె డబ్ల్యూ హెచ్ ఆర్ సి )సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హుమెన్ రైట్స్ సొసైటీ నేషనల్ చైర్మన్ డాక్టర్ కొప్పుల విజయ్ కుమార్ నేషనల్ జనరల్ సెక్రెటరీ మామిడాల మనోహర్, సౌత్ ఇండియా చైర్మన్ డాక్టర్ గంప హనుమా గౌడ్, నేషనల్ వర్కింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ సంపత్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర చైర్మన్ లోయపల్లి నర్సింగరావు చేతులమీదుగా ఈ అవార్డు ప్రచారం చేశారు.

## డబల్ బెడ్ రూమ్ ఇళ్లను సందర్శించిన ఎం ఆర్ పి ఎస్ నాయకులు మండల అధ్యక్షుడు వినేష్ మాదిగ

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ప్రజా తీర్పు ప్రతినిధి, సందీప్, డిసెంబర్ 10**

భద్రాచలం పట్టణం స్థానిక ఏఎంసీ కాలనీలో గత ప్రభుత్వం నిర్మించిన డబల్ బెడ్ రూమ్ లను ఎం ఆర్ పి ఎస్ నాయకులు సందర్శించి వాటి బాగుగోగులను అధికారులు వచ్చి పేదలకు ఇచ్చే ఇళ్లను చూసి కనీస వసతులు కూడా రెడీ చేయని వైనం ఏమి చేయకుండానే డబల్ బెడ్ రూమ్ఇళ్ళ లీస్ట్ తయారు చేసారు అధికారులు గ్రామాలకు తెలియకుండానే గ్రామసభలు పెట్టి ఆయొక్క లీస్ట్ ని తయారు చేయడం జరిగింది.అలాగే రాత్రి అయితే బెడ్ రూములు పగలైతే డబల్ బెడ్ రూములు వాటిలో పబ్బు లాగా లాడ్జి లాగా వాడుకుంటున్నారు వికలాంగులకు కేటాయించిన ఇల్లను కింద భాగంలో ఇవ్వాలి ముఖ్యంగా యువత వాటిలో గంజాయి మత్తులో ఉంటున్నారు పోలీస్ యంత్రాంగం వాళ్ళని పట్టించుకోకుండా ఉంటున్నారు వీటి అన్నిటిని కూడా అధికారులు స్పందించి తక్షణమే వాటిని పూర్తిచేసి నిరుపేద పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎం ఆర్ పి ఎస్ జిల్లా అధ్యక్షురాలు వేల్పుల సూర్య వాణి మండల అధ్యక్షురాలు గుండె సువాసిని డివిజన్ నాయకులు బొక్కా రాంబాబు తోకల దుర్గ ప్రసాద్ కారుమంచి సతీష్ శోభన్ వెంకటేశ్వర్లు శివ శ్రీను సురేష్ పాల్గొన్నారు.



## సముద్రాల సర్పంచ్ పదవి ఎస్సీలకు కేటాయించాలి

### ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కు వినతి

**( ప్రజాతీర్పు ప్రతినిధి కోహెడ డిసెంబర్ 10 )**

సిద్దిపేట జిల్లా కోహెడ మండల%శీ% సముద్రాల గ్రామానికి గత 50 సంవత్సరాల నుండి సర్పంచ్ పదవికి ఎస్సీ రిజర్వేషన్ రాలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గ్రామానికి చెందిన చింతకింది సింగరయ్య సోమవారం జిల్లా కలెక్టర్ కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. డ్రా, రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లు కేటాయించినప్పటికీ సముద్రాల గ్రామానికి మాత్రం ఇప్పటివరకు సర్పంచ్ పదవి ఎస్సి రిజర్వేషన్ అవకాశం రాలేదని సింగరయ్య ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పటి వరకు బీసీ మహిళ, బీసీ జనరల్, ఓసి జనరల్ మాత్రమే వచ్చాయని అన్నారు. గ్రామ రాజకీయ నాయకులు కొందరు ఎస్సీ రిజర్వేషన్ రాకుండా అడ్డుకుంటున్నారని కలెక్టర్ కు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈసారి సముద్రాల సర్పంచ్ పదవి ఎస్సీలకు కేటాయించాలని కోరారు. కలెక్టర్ వినతి పత్రాన్ని డిపిఓకు పంపించినట్టు శంకరయ్య తెలిపారు.



## ఆశా వర్కర్లకు పనికి తగ్గ వేతనం చెల్లించాలి

### హైదరాబాద్ కమిషనరేట్ ముట్టడి

**ఎండపల్లి, డిసెంబర్ 10 ( ప్రజా తీర్పు ప్రతినిధి)**

తమకు గౌరవ వేతనం, పారితోషికం కాకుండా తమ పనికి తగ్గ ఫిక్స్ డ్ వేతనం ప్రతి నెల రూ. 18000 /- చెల్లించాలని రాష్ట్రవ్యాప్తంగా ఆశా వర్కర్లందరూ సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ లోని కమిషనరేట్ కార్యాలయాన్ని ముట్టడించారు. తమకు ఫిక్స్ డ్ వేతనం చెల్లించాలని, అలాగే ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగులకు అందించే అలవెన్స్ లన్నీ వర్తింపజేయాలని ఆశా వర్కర్లు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ఎండపల్లి మండలంలోని ఆశ వర్కర్లందరూ పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. కార్యక్రమానికి వెళ్లిన వారిలో ఆశ వర్కర్ల సంఘం నాయకురాల్లు దేవి విమల, సరస్వతి లతో పాటు ఆయా గ్రామాల ఆశా వర్కర్లు జారి లక్ష్మి, దొనకొండ నర్మద, కనుకమ్మ, స్వప్న,కవిత, ప్రమీల,సరళ, మమత, రజిత, రాజేశ్వరి తదితరులున్నారు.



# గిరిజన ఆశ్రమ పాఠశాలు, హాస్టల్స్ లో పనిచేస్తున్న ఏఎన్ఎంలకు 11 నెలల వేతనాలు చెల్లించాలి

## ప్రజాభవన్‌లోఆందోళనకు దిగిన ఏఎన్ఎంలు

### 20 రోజుల్లో వేతనాలు చెల్లిస్తామని ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చెన్నారెడ్డి, ప్రజా పాలన నోడల్ ఆఫీసర్ దివ్య హామీ

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ప్రజా తీర్పు ప్రతినిధి, సందీప్, డిసెంబర్ 10**



గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోగల ఆశ్రమ పాఠశాలలు,హాస్టల్స్ విద్యార్థుల వైద్య సంక్షేమం కోసం నియమించిన ఏఎన్ఎం లకు 11 నెలల బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ గిరిజన సంక్షేమ శాఖ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు ప్రజాభవన్ ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ మాజీ మంత్రి జి చెన్నారెడ్డి, ప్రజా పాలన రాష్ట్ర నోడల్ ఆఫీసర్ దివ్య ఏఎన్ఎం లతో చర్చలు జరిపారు .20 రోజుల్లోపు బకాయి వేతనాలు మొత్తం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. . ఈ సందర్భంగా జరిగిన సభలో గిరిజన సంక్షేమ శాఖ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.బ్రహ్మాచారి మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ తీవ్ర నిర్లక్ష్యం చేస్తుందని కార్మికుల సమస్యల పట్ల మొండి వైఖరి ప్రదర్శిస్తుందని విమర్శించారు. ఆర్థిక శాఖలో పెండింగ్ ఉన్న ఏఎన్ఎంల వేతనాలు చెక్కును వెంటనే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి నెల మొదటి వారంలో వేతనాలు చెల్లించాలని వారాంతపు సెలవును అమలు చేయాలని డిమాండ్ చేశారు. పిఎఫ్ ఈఎస్ఐ పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏఎన్ఎంలు సంఘటితంగా పోరాడితేనే సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. గిరిజన విద్యార్థుల రక్షణ కోసం ఏఎన్ఎంలు అంకితభావంతో కృషి చేస్తున్నారని వారి సమస్యల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించడం సరైంది కాదని నాయకులు పేర్కొన్నారు .ఈ ధర్నా కార్యక్రమంలో సిఐటియు ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ఎ.కిరణ్ ములుగు జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్, ఆసిఫాబాద్ జిల్లా సిఐటియు అధ్యక్షులు ఆర్ రాజేందర్ తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్(సి ఐ టి యు )ఎ.యన్.యం నాయకురాలు స్వరూప, రాజమణి, రాజమణి, పల్లవి,జంగుబాయ్,రమ,శ్రీదేవి,జయశ్రీ,విన్నాక్షి,మహేశ్వ రి, నర్మద తదితరులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్లపై పోలీసుల ప్రవర్తన సరికాదు – శ్రీరాములు అందెల

### తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ నాడే మహిళలపై విచక్షణ కోల్పోయి దాడి చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ యంత్రాంగం – శ్రీరాములు అందెల

### వెంటనే ఆశా వర్కర్లకు సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి – శ్రీరాములు అందెల

**మహేశ్వరం నియోజకవర్గం (ప్రజా తీర్పు పత్రిక రిపోర్టర్ వై యాదగిరి)...**

అసెంబ్లీ ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీ ప్రకారం 18000 రూపాయల ఫిక్స్డ్ జీతాలు ఇవ్వాలని కోరుతూ కోఠి లోని డిఎంఈ కార్యాలయం ముందు ఆశా వర్కర్లు ఆందోళనకు దిగారు. వారిని అరెస్టు చేసే క్రమంలో మహిళా పోలీసులు ఉన్నా కానీ...మగ పోలీసులు ఆశా వర్కర్లను ఈడ్చుకుంటూ వెళ్తూ, అసభ్య పదజాలంతో బూతులు తిట్టారు, అలాగే ఆశా వర్కర్ల పై చేయి చేసుకుంటూ డీసీఎం లోకి ఎక్కించారు. ఈ సందర్భంగా బిబిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జి అందెల శ్రీరాములు యాదవ్‌లి గారు ఈరోజు మహేశ్వరం నియోజకవర్గ కార్యాలయంలో మాట్లాడుతూ ఆశా వర్కర్లపై పోలీసుల అత్యుత్సాహం ప్రదర్శించడం సరికాదన్నారు, తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ నాడే మహిళలపై విచక్షణ కోల్పోయి దాడి చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ యంత్రాంగం మరియు సీఎం రేవంత్ రెడ్డి గారు వెంటనే ఆశా వర్కర్లకు క్షమాపణ చెప్పాలని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఆశా వర్కర్లను రోడ్డున పడేస్తే, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నమ్మి వారిని గద్దెనెక్కిస్తే మళ్లీ ఈ ప్రభుత్వం కూడా బిఆర్ఎస్ తరహాలోనే పాలన సాగిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు స్వయానా రేవంత్ రెడ్డి ఆశా వర్కర్లకు ప్రతి నెల 18 వేల రూపాయలు ఫిక్స్డ్ జీతము తో పాటు, ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన హామీ కొరకు చేస్తున్నటువంటి ఆశా వర్కర్ల న్యాయమైన పోరాటానికి రేవంత్ సర్కార్ దిగి రావాలన్నారు. ఇప్పటికే ఏడాది కాలంలో ఆశా వర్కర్లు అనేకసార్లు రోడ్డెక్కారని ఇకనైనా ప్రభుత్వం వారికి ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.





# యువతతోనే దేశ భవిష్యత్

### మార్పు కోసం నేటితరం రాజకీయాల్లోకి రావాలి.

### పార్టీ ఎన్నికల్లో గెలిచిన యూత్ కాంగ్రెస్ నాయకులను అభినందించిన కిచ్చెన్న

**మహేశ్వరం నియోజకవర్గం (ప్రజా తీర్పు పత్రిక రిపోర్టర్ వై యాదగిరి)...**

దేశ భవిష్యత్, మార్పు కోసం యువత రాజకీయాల్లోకి రావాలని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ ఎన్నికల్లో విజయం సాధించిన యూత్ కాంగ్రెస్ నాయకులను అభినందించారు KLR. గెలిచిన రంగారెడ్డి జిల్లా, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు... మర్యాద పూర్వకంగా లక్ష్మారెడ్డిని తుక్కుగూడ కాంగ్రెస్ కార్యాలయంలో కలిశారు. పార్టీలో పదవులకు ఎన్నికలు నిర్వహించి పారదర్శకత చాటుకోవడం, యువతకు ఎన్నికలపై అవగాహన కల్పించేందుకు... కాంగ్రెస్ సంస్థాగత ఎన్నికలు నిర్వహిస్తోందని కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ నాయకులు సహా కొత్తగా ఎన్నికైన రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగేందర్ రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వల్లపు సుభాన్ యాదవ్, ఉపాధ్యక్షులు ఫాజిల్ ఖాద్రి, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సామ వరుణ్, కందుకూరు మండల అధ్యక్షులు వెంకటేష్‌గౌడ్, బాలాపూర్ మండలం రవి కాంత్ రెడ్డి, సరూర్ నగర్ డివిజన్ అధ్యక్షులు యూనిస్, ఉపాధ్యక్షులు శివ, సందీప్ రెడ్డిలను సన్మానించారు.

# పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

### 400 గ్రామపంచాయతీలలో 3368 వార్డుల్లో పోలింగ్ కేంద్రాలు.

**(ప్రజాతీర్పు జిల్లాప్రతినిధి నిర్మల్ డిసెంబర్ 10)**



జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణపై మంగళవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో సవరించిన ఓటరు జాబితా ప్రకారము నాలుగు కొత్త గ్రామ పంచాయతీలు కలుపుకొని మొత్తం 400 గ్రామపంచాయతీలో 3368 వార్డుల్లో 3368 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. పెరిగిన కొత్త గ్రామ పంచాయతీలలో ఖానాపూర్ మండలంలోని రంగపేట, కడెం మండలం న్యూ ధర్మాజీపేట, తానూర్ మండలం కళ్యాణి, కుబీర్ మండలం రాంసింగ్ తాండ గ్రామాలు ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 2,33,687 మహిళా ఓటర్లు, 2,12,517 పురుష ఓటర్లు, 15 మంది ఇతర ఓటర్లతో కలుపుకొని మొత్తం 4,46,219 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఈ ఓటరు జాబితా పై ఏవైనా అభ్యంతరాలు, సందేహాలు ఉన్నట్లయితే మండల స్థాయిలో జరగబోవు సమావేశంలో రాత పూర్వకంగా అధికారులకు వివరిస్తే, వాటిని విచారించి తుది జాబితాను ప్రకటిస్థామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, జెడ్పి సీఈవో గోవింద్, డిపిఓ శ్రీనివాస్, డిఎల్పిఓ రమేష్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు శ్రవణ్ రెడ్డి, గంద్రత్ రమేష్, సిరికొండ రమేష్, గాజుల రవి, మజార్, నరేష్, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# తండ్రిని చంపిన కీచక తనయుడి అరెస్ట్.

**(ప్రజాతీర్పు జిల్లాప్రతినిధి నిర్మల్ డిసెంబర్ 10)**

కనీస కనికరం లేని కుమారుడు తన కన్న తండ్రినే చంపిన సంఘటన ముటాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. మంగళవారం నిందితుడు గుర్రం మనిదీప్ ను పోలీసులు అదుపులో తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుర్రం ముత్యంను తన కుమారుడు గుర్రం మనిదీప్ గొంతు పిసికి హత్య చేశాడు. గత రెండు రోజుల క్రితం మృతుడు గుర్రం ముత్యం తన తల్లి వెంకవ్వ కు మద్యం సేవించడానికి డబ్బులు అడగగా ఆమె ఇవ్వక పోవడం తో, గుర్రం ముత్యం ఆమె దగ్గర ఉన్న బీరువా తాళం తీసుకొని అందులో ఉన్న డబ్బులు తీసుకుంటూ అందులోని అప్పు పత్రాలను చింపుతుండగా, తల్లి వెంకవ్వ అడ్డుపడింది. దీంతో అక్కడే ఉన్న గొడ్డలి తో మృతుడు గుర్రం ముత్యం తన తల్లి పై దాడి చేయగా ఆమెకు తలకు శరీర ఇతర భాగాలకు గాయాలు అయ్యాయి, అదే సమయంలో మృతుడి కుమారుడు గుర్రం మనిదిప్ తన ఇంటికి వచ్చి నానమ్మ ను ఎందుకు కొట్టుతున్నావని నిలదీశాడు. ఈ సందర్భంగా విరిద్దరి మధ్యలో గోడవ జరిగింది. తండ్రి పై కోపం పెంచుకున్న గుర్రం మనిదిప్ తన నాన్న ను చంపుటకు ఇదే మంచి అవకాశం అని అనుకోని,తండ్రి గుర్రం ముత్యం గొంతు పట్టి గట్టిగ పిసికాడు, తండ్రీ కింద పడిపోగా గుర్రం మనిదిప్ తన ఇంటి లో ఉన్న తన అమ్మ చీర తీసుకొని అతని తండ్రి మెడ చుట్టూ బిగించి చంపాలని గట్టిగ లాగాడు.గుర్రం ముత్యం కొద్దిసేపు గిల గిల కొట్టుకొని మరణించాడు. అనంతరం గుర్రం మనిదిప్ తన తండ్రిని ఇంట్లో పడుకోబెట్టి అతని పై ఒక బ్లాంకెట్ కప్పి, తన నానమ్మ ను దేవేందర్ రెడ్డి హాస్పిటల్ కు తీసుకొని వచ్చి తన నానమ్మ ప్రమాదవశాత్తు బాత్రుం నందు పడిందని చెప్పి అడ్మిట్ చేసి పారిపోయాడు. మృతుడి వరుసకు అన్న అయినటువంటి గుర్రం రాజేశ్వర్ వెంటనే నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్ కి వెళ్లి దరఖాస్తు ఇవ్వటంతో . ఎస్ఐ జి.లింబాద్రి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. తక్షణమే స్పందించిన నిర్మల్ రూరల్ సిఐ రామ కృష్ణ, ఎస్సై లింబాద్రి లు తన సిబ్బంది తో చాకచక్యం నేరస్తుడిని హత్య జరిగిన 24 గంటల లో అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపించారు.ఈ కేసులో చురుకుగా బాధ్యత నిర్వర్తించిన ఇన్స్పెక్టర్ రామ కృష్ణ, ఎస్ఐ లింబాద్రి సిబ్బంది నీ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల అభినందించారు




# అనాధ ఆశ్రమాలకు అండగా నిలవాలి.....!

### లైన్స్ క్లబ్ అధ్యక్షులు రామలింగేశ్వరరావు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ప్రజా తీర్పు ప్రతినిధి, సందీప్, డిసెంబర్ 10**

అనాధ వృద్ధాశ్రమాలకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని లైన్స్ క్లబ్ అధ్యక్షులు చిట్టి నీడు రామలింగేశ్వర రావు కోరారు. మంగళవారం పట్టణంలోని కహల్ బాలుల ఆశ్రమంలో లైన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం ఆధ్వర్యంలో దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామలింగేశ్వర మాట్లాడుతూ శీతాకాలం నేపథ్యంలో గత నెల నుండి ఆశ్రమ పాఠశాలలలో విద్యార్థులకు లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్లను పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపట్టామని గుర్తు చేశారు. లైన్స్ క్లబ్ సభ్యుల సహకారంతో అనేక రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు రూపొందించేందుకు ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఇతర స్వచ్ఛంద సంస్థలు ప్రముఖులు సైతం కహల్ అనాధ బాలల ఆశ్రమాన్ని సందర్శించి వారికి అండగా నిలవాలని కోరారు. ప్రత్యేకించి మన జీవితాలలో జరిగే ప్రత్యేకమైన రోజులలో ఇటువంటి ఆశ్రమాలలో గడుపు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ కార్యదర్శి సీతారాంరెడ్డి లైన్స్ క్లబ్ సభ్యులు అనుకోజు నరసింహాచారి దాట్ల రాజు గ్రీన్ భద్రాద్రి అధ్యక్షులు ఉమా శంకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలపై జరుగుతున్న హింసలను దాడులను అరికట్టాలి

### ఐద్వా జిల్లా అధ్యక్షురాలు డి సీత లక్ష్మి

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ప్రజా తీర్పు ప్రతినిధి, సందీప్, డిసెంబర్ 10**

మహిళలపై జరుగుతున్న హింస దాడులను అరికట్టలని మహిళలకు చట్టం కల్పించాలని. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా భద్రాచలం రాజు పేట సెంటర్ మహిళ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించి తదుపరి మానవహారం నిర్వహించారు. ఐద్వా ఆఫీస్ బేరర్ గౌతమి ఏ జే అధ్యక్షతన వహించిన ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు డి సీత లక్ష్మి మాట్లాడుతూ. ప్రపంచవ్యాప్తంగా మానవ హక్కులు నిర్మూలించే విధంగా ఐక్యంగా పోరాటాలు చేయాలని దేశానికి స్వాతంత్రం వచ్చి భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి దశాబ్దాలు గడుస్తున్న మహిళలు మైనార్టీలు దళితులు గిరిజనులు ఆదివాసులకు హక్కులు అందకుండనే పోతున్నాయి. మహిళా చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆర్థిక రాజకీయ రంగాలలో స్త్రీలకు సమాన భాగం అవకాశం కల్పించాలి. విద్య వైద్యం రంగాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని స్త్రీలపై చిన్నారులపై జరుగుతున్న దాడులను హింసను అరికట్టాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో ఐద్వా ఆఫీస్ బేరర్ ఏ.సక్కుబాయి, జి.రాధా, జి నాగలక్ష్మి , కనక శ్రీ, డి.నాగలక్ష్మి, సి హెచ్ హైమవతి, ఎస్ కే చోటమ్మ, పి.లక్ష్మి కాంతం, కే రమణ , చుకమ్మ, దేవి, తదితరులు పాల్గొన్నారు.



# వీధి కుక్కల నియంత్రణ ఏదీ?

## భైంసా పట్టణ కేంద్రంలో తిరుగుతున్న విధి కుక్కలు.

## పట్టణంలో గుంపులు గుంపులుగా సంచారం.

## పట్టించుకోని అధికారులు.

(ప్రజాతీర్పు జిల్లాప్రతినిధి నిర్మల్ డిసెంబర్ 10)

వీధి కుక్కలను అదుపు చేసేవారు లేకపోవడంతో ప్రతీ గ్రామంతో సహా పట్టణంలో నిత్యం ఎక్కడో ఒకచోట చిన్నారులు, బాటసారులు, మూగజీవాలపై దాడులు చేస్తున్నాయి. ఇప్పటికే భైంసా మండలంలోని చాలా గ్రామాల్లో వీధి కుక్కల కాటుకు గురైన వారి సంఖ్య అధికంగానే ఉంది. దీంతో పాటు ఇళ్ల దగ్గర పెంచుకుంటున్న పశువులు, గొర్రెలు, మేకలపై దాడి చేయడంతో చాలా వరకు మృత్యువాత పడ్డాయి. విషయం కి వెళ్తే నిర్మల్ జిల్లా భైంసా పట్టణ కేంద్రంలో ముస్లిం షాది ఖానా, పరిసర ప్రాంతాల్లో వీధికుక్కల బెడద పెరిగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పాఠశాల విద్యార్థులు, మహిళలు, రోజువారీ పనులకు వెళ్లే పౌరులు భయాందోళనలకు గురవుతున్నారు. వీధికుక్కల సంచరిస్తున్న వీధుల్లో పిల్లలకు ప్రమాదమే కాకుండా రోజువారీ జీవితాన్ని కూడా ప్రభావితం చేస్తుంది.



గతంలో భైంసా మున్సిపల్ అధికారులు వీధి కుక్కలను పట్టే వారిని పిలిపించి వీధి కుక్కలను పట్టించి దూర ప్రాంతాల్లో వదిలేశారు. ఆ సమయంలో తప్పిపోయి ఉన్న కొన్ని వీధి కుక్కల సంతతి ఈ ఐదేళ్లలో పెరిగిపోయింది. వీధి కుక్కల బెడదను అరికట్టేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని, పట్టణ ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమ రోజువారీ కార్యకలాపాలను కొనసాగించేందుకు వీలుగా ఈ సమస్య నుంచి బయటపడాలని మున్సిపల్ కమిషనర్ భైంసాకు ప్రజలు విజ్ఞప్తి చేశారు.





## సిఎం హేమంత్ సోరేన్‌తో బృందాకరత్ భేటీ

రాంఛి : జార?ండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్‌తో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ భేటీ అయ్యారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మతతత్వ శక్తులను ఓడించి లౌకిక శక్తులు ఘన విజయం సాధించిన సందర్భంగా హేమత్ సోరేన్‌కు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. మర్యాదపూర్వకంగా జరిగిన ఈ భేటీలో బృందాకరత్‌తో పాటు పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రకాశ్ విప్లవ్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రఫుల్ లిండా, సమీర్ దాస్, సంజయ్ పాశ్వన్ కూడా పాల్గొన్నారు.

**జార?ండ్ స్పీకర్‌గా రవీంద్రనాథ్ మహతో**

జార?ండ్ అసెంబ్లీ స్పీకర్‌గా జెఎంఎం ఎమ్మెల్యే రవీంద్ర నాథ్ మహతో వరుసగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఘనత సాధించిన తొలి నేతగా ఆయన నిలిచారు. సోమవారం నుంచి జార?ండ్ అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు ప్రారంభమయ్యాయి. రెండో రోజున సమావేశాల్లో స్పీకర్‌గా మహతో పేరును ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ప్రతిపాదించారు. జెఎంఎం ఎమ్మెల్యే మధుర ప్రసాద్ మహతో బలపర్చారు. సంతాల్ పరగణాల డివిజన్‌లోని నాలా అసెంబ్లీ నుంచి ఇటీవల ఎన్నికల్లో మహతో విజయం సాధించారు. 2005లో తొలిసారిగా ఎమ్మెల్యేగా విజయం సాధించిన ఆయన 2009 ఎన్నికల్లో మినహా 2014, 2019ల్లోనూ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. గత అసెంబ్లీలోనూ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వహించారు.



## ముంబయిలో ఘోర రోడ్డు ప్రమాదం


### ఏడుగురు మృతి.. 49 మందికి గాయాలు

ముంబయి : ముంయిలో సోమవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ముంబైలోని కుర్లాలో మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన బెస్ట్ అనే బస్సు అదుపుతప్పి పాదచారులపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఏడుగురు మృతి చెందారు. మరో 49 మంది గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళితే.. సోమవారం రాత్రి కుర్లా నుంచి అంధేరికి వెళ్తున్న బెస్ట్ బస్సు బుద్ధ కాలనీ వద్దకు రాగానే బ్రేకులు ఫెయిల్ అయి పాదచారులపైకి, కొన్ని వాహనాలపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మరో నలుగురు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. సమాచారం తెలుసుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగ్రాతులను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. కాగా, ఈ ఘటనలో పోలీసులు డ్రైవర్‌ని అదుపులోకి తీసుకుని విచారించారు. బస్సు బ్రేక్ ఫెయిల్ అవ్వడంతో నియంత్రణ కోల్పోయినట్లు డ్రైవర్ చెప్పినట్లు పోలీసులు తెలిపారు. అయితే బస్సును డ్రైవర్ అతివేగంతో నడిపారని స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో ప్రమాదానికి గురైన బస్సు.. కొత్తదేనని.. మూడు నెలల క్రితమే రిజిస్ట్రేషన్ అయిందని ఆర్‌టివో పేర్కొన్నారు.

## ఎట్టకేలకు బోనెక్కిన నెతన్యాహు

### అవినీతి కేసులో కోర్టు విచారణకు హాజరు

టెల్ అవీవ్ : యుద్ధోన్మాద దాడులతో, నియంతృత్వ పోకడలతో రెచ్చిపోతున్న ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహు ఎట్టకేలకు బోనెక్కాల్సివచ్చింది. అయితే యుద్ధనేరాలకు సంబంధించిన కేసులో కాదు. అవినీతి మకిలీ పులుముకున్న నేరాభియోగాలపై ఆయన కోర్టు బోనెక్కాల్సివచ్చింది. తనపై వచ్చిన అవినీతి అభియోగాలకు సంబంధించి తొలిసారిగా నెతన్యాహు విచారణకు హాజరయ్యారు. ఇతర సాక్షుల మాదిరిగానే నెతన్యాహుకు కూడా కొన్ని సదుపాయాలు వుంటాయని, ఆయన కూర్చుని లేదా నిల్చుని ఎలాగైనా సాక్ష్యమివ్వవచ్చని న్యాయమూర్తుల్లో ఒకరు తెలిపారు. అవినీతి, విశ్వాస ఉల్లంఘన, ముడుపులు స్వీకరించడం ఇలా మూడు వేర్వేరు కేసుల్లో ఆయనపై విచారణ జరగనుంది. కిక్కిరిసిన కోర్టు గదిలోకి వచ్చిన నెతన్యాహు చాలా సాధారణంగా కనిపించారు. తనకు తన కుటుంబానికి సంబంధించిన వార్తలను సానుకూలంగా ప్రచురించినందుకు ప్రతిఫలంగా మీడియా పెద్దలకు నిబంధనల్లో సడలింపులు ఇచ్చారని కూడా ఆయన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. హాలివుడ్ నిర్మాత వ్యక్తిగత, వ్యాపార ప్రయోజనాల కోసం సహకరించినందుకు ప్రతిగా వేలాది డాలర్ల విలువైన సిగార్లు, షాంపేన్‌లు ముడుపులుగా అందుకున్నారని అభియోగాలున్నాయి. అయితే తానెలాంటి తప్పులు చేయలేదని నెతన్యాహు వాదిస్తున్నారు. ఇవన్నీ తనకు వ్యతిరేకంగా వుండే మీడియా పన్నిన కుట్రలుగా పేర్కొన్నారు. తన సుదీర్ఘ కాల పాలనకు తెర దించేయాలనే లక్ష్యంతోనే కక్ష సాధింపుతో ఇవన్నీ జరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. అయితే గాజాలో దాడుల కారణంగా అంతర్జాతీయంగా నెతన్యాహుపై తీవ్ర వ్యతిరేకత నెలకొంది. అలాగే అంతర్జాతీయ న్యాయస్థానం కూడా ఆయన అరెస్టుకు వారంట్లు జారీ చేసింది. ఇటువంటి సమయంలో నెతన్యాహు ఈ విచారణను ఎదుర్కొనాల్సిరావడం గమనార్హం.





## సమాఖ్య స్ఫూర్తితో ఆర్థిక కేటాయింపులు

### 16వ ఆర్థిక సంఘానికి కేరళ వినతి

### కేంద్రం తోడ్పాటువుంటేనే రాష్ట్రాల ప్రగతి

తిరువనంతపురం : దేశ ఆర్థిక వ్యవస్థను పరిరక్షించే బృహత్తర బాధ్యత 16వ ఆర్థిక సంఘానిదని, అలాంటి బాధ్యతను సమాఖ్య స్ఫూర్తికి విఘాతంగా కలగకుండా నిర్వర్తించాలని కేరళ ఆర్థిక మంత్రి కెఎన్ బాలగోపాల్ విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి సంతృప్తికర తోడ్పాడు ఉంటేనే రాష్ట్రాల ప్రగతి సాధ్యమని ఆయన తెలిపారు. మూడు రోజుల అధికారిక పర్యటనలో భాగంగా 16వ ఆర్థిక సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ అరవింద్ పనగారియా నేతృత్వంలోని బృందం కేరళలో పర్యటిస్తోంది. తొలి రోజైన మంగళవారం ఆర్థిక సంఘం బృందానికి బాలగోపాల్ సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేరళకు నిధుల కేటాయింపుల్లో న్యాయం చేయాలని విన్నవించారు. 'కేరళ అభివృద్ధి నమూనా' కింద రాష్ట్రం సాధించిన విజయాలను ఆయన వివరించారు. ఈ విజయాలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో లభించిన పురస్కారాలు, ప్రశంసలు గురించి గుర్తు చేశారు. అయితే మౌలిక వసతుల అభివృద్ధిలో కేరళ సాధించాల్సింది ఇంకా చాలా ఉందని, ఇందుకు కేంద్రం, ఆర్థిక సంఘం సహకరించాలని కోరారు. ముఖ్యంగా ఉన్నత విద్య, పరిశోధన వంటి రంగాల్లో చేయాల్సింది చాలా వుందన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎన్ని వున్నప్పటికీ ఈ అంతరాలను పూడ్చేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటూనే వుందని చెప్పారు. 10 నుండి 15వ ఆర్థిక సంఘం వరకు కేంద్రం నిధుల్లో కేరళ వాటా తగ్గిపోవడాన్ని ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. 10వ ఆర్థిక సంఘంలో 3.88 శాతం వాటా రాగా 15వ ఆర్థిక సంఘం నాటికి అది 1.92 శాతానికి పడిపోయిందన్నారు. పర్యావరణ విపత్తుల వల్ల ఆర్థికంగా ఎన్ని ఎదురు దెబ్బలు రాష్ట్రాభివృద్ధి కోసం కేరళ ప్రభుతవం కృషి చేస్తోందని, ఇందుకు కేంద్రం కూడా చేయూతనందించాలని కోరారు. ప్రకృతి విపత్తుల వేళ ఆర్థికంగా ఆదుకోవాల్సిన కేంద్రం ఆ పని చేయడం లేదన్నారు. 16వ ఆర్థికసంఘంగానైనా కేరళకు ఆర్థిక కేటాయింపులు విషయంలో న్యాయం చేయాలని కోరారు. అభివృద్ధి వికేంద్రీకరణలో కేరళ ఆదర్శనీయమైన కృషి చేస్తోందని తెలిపారు. స్థానిక ప్రభుత్వాలకు నిధులను అందచేయడంలోనూ, వారి కార్యకలాపాలను వికేంద్రీకరించడంలోనూ ఇతర రాష్ట్రాలతో పోలిస్తే కేరళ ముందుందన్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక, ద్రవ్యపరమైన ఆందోళనలను పరిష్కరించాల్సిందిగా కోరారు. అభివృద్ధి ప్రాధాన్యతలను అమలు చేయాల్సిందిగా కోరుతూ 16వ ఆర్థిక సంఘం సభ్యులకు బాలగోపాల్ మెమోరాండాన్ని అందచేశారు.

## మానవ హక్కులకు పెనుముప్పు

### మానసిక ఆరోగ్యం, సైబర్ నేరాలు, వాతావరణ మార్పులపై రాష్ట్రపతి

న్యూఢిల్లీ : మానసిక ఆరోగ్యం, సైబర్ నేరాలు, వాతావరణ మార్పులు వంటి సమస్యలు మానవ హక్కులకు ముప్పుగా మారాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి మాట్లాడుతూ వృద్ధి చెందుతున్న గిగ్ ఎకానమీతో గిగ్ వర్కర్ల మానసిక ఆర్యోగంపై ప్రతికూల ప్రభావం చూపుతుందన్న విషయాన్ని వ్యాపారవేత్తలు గ్రహించాలని ఆమె సూచించారు. అలాగే కృత్రిమ మేధస్సు (ఎఐ) వినియోగం గురించి ఆలోచించాల్సిన అవసరం ఉందని కూడా తెలిపారు. మానవ జీవితాలకు ఎఐ వినియోగంతో మంచి, చెడు కూడా జరుగుతుందని చెప్పారు. డిజిటల్ యుగం అభివృద్ధి చెందుతున్న కొద్దీ సైబర్ బెదిరింపులు, డీప్‌ఫేక్‌లు, గోప్యతా సమస్యలు, నకిలీ సమాచారం వ్యాప్తి వంటి సమస్యలు పెరుగుతున్నాయని చెప్పారు.



## గ్రంథాలయాల బలుపేతానికి కృషి చేస్తా

### పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించండి

### స్టడీ మెటీరియల్ పంపిణి చేసిన అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి

( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో కరీంనగర్ డిసెంబర్ 10 )

పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతీ యువకులకు విఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్ని పోటీ పరీక్షలకు ఉపయోగపడే కాంపిటేటివ్ ఆప్టిట్యూడ్ స్టడీ మెటిరియల్ ను ఉచిత పంపిణీ చేస్తున్నామని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ ఫోర్స్ నరేందర్ రెడ్డి వెల్లడించారు. మంగళవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో ఫంక్షన్ హాల్ లో 600 మందికి యువతీ యువకులకు స్టడీ మెటీరియల్ను అందజేశారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులకు బాసటగా నిలిచేందుకే తాను ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రంథాలయాల బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. తన రెండు నెలల పర్యటనలో చాలా గ్రంథాలయాలకు వెళ్లడం జరిగిందని పేర్కొన్నారు. చాలాచోట్ల మౌలిక సదుపాయాలు ఇబ్బందులు పడుతున్నారని కొన్నిచోట్ల దూర ప్రాంతాల నుండి జిల్లా కేంద్రాలకు వచ్చి చదువుకునే విద్యార్థులకు మధ్యాహ్న భోజనము లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. తన సొంత నిధులతో చాలాచోట్ల భోజన ఏర్పాట్లతో పాటు , చేర్ ప్యాడ్స్, వాటర్ కూలర్స్ , సింటెక్ ట్యాంకులు, కొన్నిచోట్ల అదనపు తరగతి గదులకు రేకులు వేయించానని గుర్తు చేశారు. నిరుద్యోగ నిర్మూలనకు పాటుపడతానని ప్రతి ఒక్క పట్టభద్రుడు తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టో లో పెట్టిన జాబ్ క్యాలెండర్ అమలుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రానున్న రోజుల్లో అన్ని లైబ్రరీలో ప్రభుత్వం తరఫున ఉచిత మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బుర్ర మధుసూదన్ రెడ్డి, చందు,సత్యం తదితరులు పాల్గొన్నారు



# 'ఇన్సూరెన్స్' నిర్వీర్యమేనా?

## బీమా రంగంలో 100 శాతం ఎఫ్‌డిఐ

## 74 శాతం నుంచి పెంచాలంటూ ప్రతిపాదన

## సంబంధిత బిల్లుపై కేంద్రం అత్యుత్సాహం

## బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టే అవకాశం




న్యూఢిల్లీ : కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ-2 పాలనలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎఫ్‌డిఐ)ను అప్పటి ప్రతిపక్ష బిజెపి తీవ్రంగా వ్యతిరేకించింది. దేశ ప్రయోజనాల దృష్ట్యా ఎఫ్‌డిఐకి మద్దతు ఇవ్వబోమని చెప్పింది. తుది శ్వాస వరకూ ఎఫ్‌డిఐను వ్యతిరేకిస్తామని ఆ సమయంలో తెలిపింది. న్యూఢిల్లీలో 2013లో కాన్ఫడరేషన్ ఆఫ్ ఆలిండియా ట్రేడర్స్ (సీఏఐటీ) సమావేశంలో అప్పటి బిజెపి నాయకులు ఇవే మాటలు చెప్పారు. అయితే, 2014లో కేంద్రంలో మోడీ నేతృత్వంలోని ఎన్‌డిఎ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ విషయాన్ని మర్చిపోయినట్టు కనిపిస్తున్నది. ప్రస్తుతం మూడోసారి అధికారంలో కొనసాగుతున్న బిజెపి ప్రభుత్వం.. తన గత మాటలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. దేశ బీమా రంగంలో వంద శాతం ఎఫ్‌డీఐలకు దారులు తెరుస్తున్నది. దీనికి సంబంధించిన బిల్లులో ఎఫ్‌డీఐని పెంచే ప్రతిపాదనను చేసినట్టు సమాచారం. ఇదే జరిగితే, దేశంలోని అత్యంత కీలక రంగాల్లో ఒకటైన ఇన్సూరెన్స్ సెక్టార్‌పై ప్రతికూల ప్రభావం చూపుతుందని కొందరు విశ్లేషకులు చెప్తున్నారు. దేశంలోని సాధారణ ప్రజలు, రైతులు, సంస్థలు ఇలా జీవిత, ఆరోగ్య వంటి పలు రకాల బీమా మీద ఆధారపడుతుంటాయి. మోడీ సర్కారు విధానాలతో బీమా రంగంలో ప్రయివేటు, కార్పొరేటు ఆధిపత్యం ఎక్కువైంది. బీమా రంగంలోకి ప్రవేశించి పెద్ద మొత్తంలో సంపదను పోగు చేసుకుంటున్నాయి. ఎల్ఐసీ వంటి సంస్థలకు ఇది ప్రతికూల వాతావరణాన్ని కల్పించింది. కొన్ని అధ్యయనాలు, సర్వేల ప్రకారం.. ఇన్సూరెన్స్ కంపెనీల నుంచి బీమా రూపంలో వినియోగదారులకు అందే ప్రయోజనాల కంటే.. సదరు కంపెనీలే ప్రీమియం రూపంలో వచ్చే మొత్తంతో ఎక్కువగా లాభాన్ని పొందుతున్నాయి. ఇలాంటి తరుణంలో వంద శాతం ఎఫ్‌డీఐలకు దారులు తెరవటం ఈ రంగానికి చేటు చేస్తుందని కొందరు నిపుణులు వాదిస్తున్నారు. ఫలితంగా, బీమా రంగంపై దేశ, విదేశీ సంస్థల ఆధిపత్యం మరింత తీవ్రమవుతుందని హెచ్చరిస్తున్నారు. ఒకప్పుడు ప్రతిపక్షంగా ఎఫ్‌డీఐను వ్యతిరేకించిన బీజేపీ.. ఇప్పుడు అధికారంలో ఉండి దానిని సమర్థించటం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు.దీనికి సంబంధించిన బిల్లును ఎలాగైనా ఆమోదించుకోవాలని బీజేపీ చూస్తున్నది. వాస్తవానికి, ప్రస్తుత సెషన్‌లోనే ఈ బిల్లును ప్రవేశపెడతారని అంతా అనుకున్నారు. కానీ, బిల్లులో మరికొన్ని సర్దుబాట్లకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సూచించినట్టు సమాచారం. డ్రాఫ్ట్ బిల్లులో మార్పులు తీసుకొచ్చి రాబోయే బడ్జెట్ సమావేశాల్లో దీనిని ప్రవేశపెట్టే సూచనలు కనిపిస్తున్నాయి. "ఇన్సూరెన్స్ చట్టం, 1938లోని పలు నిబంధనల సవరణకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రతిపాదించింది. ఇందులో బీమా రంగంలో ఎఫ్‌డీఐను వంద శాతానికి పెంచటం, పెయిడ్-అప్ క్యాపిటల్ తగ్గింపు, కాంపొజిట్ లైసెన్స్‌కు నిబంధన వంటివి ఉన్నాయి. ఆర్థిక సేవల విభాగం (డీఎఫ్ఎస్).. ప్రతిపాదిత సవరణలపై ఈనెల 10లోగా పబ్లిక్ కామెంట్స్‌ని కోరింది" అని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం, బీమారంగంలో ఎఫ్‌డీఐ పరిమితి 74 శాతంగా ఉన్నది. అయితే, ప్రస్తుత ప్రతిపాదనతో భారతీయ బీమా కంపెనీల్లో ఇది వంద శాతానికి పెరగనున్నది. ఇన్సూరెన్స్ యాక్ట్ 1938, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ యాక్ట్ 1956, ది ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ యాక్ట్, 1999లకు ప్రతిపాదిత సవరణలపై డీఎఫ్ఎస్ నుంచి ఇది రెండో పబ్లిక్ కన్సల్టేషన్. ప్రస్తుతం, భారత్‌లో 27 జీవిత బీమా కంపెనీలు, 34 నాన్-లైఫ్ లేదా సాధారణ బీమా సంస్థలు ఉన్నాయి. ఇందులో భారత వ్యవసాయ బీమా కంపెనీ, ఈసీజీసీ లిమిటెడ్‌లు కూడా ఉన్నాయి. గతనెల 25న ప్రారంభమైన పార్లమెంటు శీతాకాల సమావేశాలు ఈనెల 20 వరకు కొనసాగనున్న విషయం విదితమే. అయితే, ఈ సమావేశాల్లో ప్రతిపక్షాలు అదానీ ముడుపుల వ్యవహారం, సంభాల్, మణిపూర్ హింస వంటి అంశాలపై చర్చకు పట్టుబడుతుండగా.. కేంద్రం మాత్రం అందుకు విముఖతను వ్యక్తం చేస్తున్నది. దీంతో, కొన్ని రోజులుగా పార్లమెంటు ఉభయ సభలూ వాయిదా పర్వంతోనే ముగుస్తున్న విషయం విదితమే.



## త్వరలో రేట్లు తగ్గుతాయ్‌లే..

### ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ సంకేతాలు

### ముగిసిన పదవీకాలం

### నా హయాంలో ఆర్థిక మంత్రిత్వ శాఖతో సమన్వయంతో ముందుకెళ్లానని వెల్లడి

ముంబై : రాబోయే ద్రవ్యసమీక్షల్లో కీలక వడ్డీరేట్లు తగ్గేందుకు వీలుందన్న సంకేతాలి చ్చారు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్‌గా పదవీ విరమణ చేస్తున్న శక్తికాంత దాస్. సుదీర్ఘకాలం పాటు రెపోరేటు స్థిరంగానే ఉంటున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో దాస్ పలుకులు ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నాయి. ఇక తన హయాంలో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ, ఆర్బీఐ మధ్య మంచి సంబంధాలే కొనసాగాయని ఆయన తెలిపారు. ఆర్బీఐ గవర్నర్‌గా మంగళవారంతో ఆయన పదవీకాలం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గడిచిన ఆరేండ్లుగా కేంద్రం, ఆర్బీఐ నడుమ సఖ్యతతో కూడిన వాతావరణమే ఉన్నట్టు, సమన్వయంతో ముందుకెళ్లినట్టు చెప్పారు. ఈ క్రమంలోనే ఇందుకు సహకరించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఇతర ఉన్నతాధికారులు, ఆర్బీఐ సిబ్బంది, వ్యాపార-పారిశ్రామిక వర్గాలు, బ్యాంకర్లకు దాస్ కృతజ్ఞతలు తెలిపారు.

**క్లిష్ట పరిస్థితులు..**

ఆర్బీఐ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన దగ్గర్నుంచి దాస్‌కు క్లిష్ట పరిస్థితులే ఎదురయ్యాయి. 1980 తమిళనాడు కేడర్ ఐఏఎస్ అధికారి అయిన దాస్.. రిటైర్మెంట్ అనంతరం 2018 డిసెంబర్‌లో మూడేండ్లకుగాను ఆర్బీఐ 25వ గవర్నర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. ఊర్జిత్ పటేల్ అనూహ్య రాజీనామాతోనే మోదీ సర్కారు దాస్‌ను తీసుకొచ్చింది. ఈ క్రమంలోనే మరో మూడేండ్లు ఆయన పదవీకాలాన్ని పొడిగించింది. ఈ సమయంలో కరోనా, జీడీపీ పతనం, ద్రవ్యోల్బణం విజృంభణ, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, మిడిల్‌ఈస్ట్ ఉద్రిక్తతలు వంటి అనేక సవాళ్లు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలోనే గత ఏడాది ఏప్రిల్ నుంచి వరుసగా 11 ద్రవ్యసమీక్షల్లో వడ్డీరేట్లను గరిష్ఠ స్థాయిల్లో స్థిరంగానే ఉంచారు. ఆర్థిక వ్యవస్థను, బ్యాంకింగ్ రంగాలను డిజిటలైజ్ చేయడంలోనూ దాస్ కీలకపాత్ర పోషించారు. సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ (సీబీడీసీ) దిశగా కూడా అడుగులు పడ్డాయి.

**అత్యధిక డివిడెండ్లు**

ఊర్జిత్ పటేల్ హయాంలో కేంద్రంతో ఆర్బీఐకి దెబ్బతిన్న సంబంధాలను దాస్ పునరుద్ధరించగా.. గొడవకు కారణమైన ఆర్బీఐ మిగులు నగదు నిల్వలను సైతం చాకచక్యంగా ఖజానాకు తరలించగలిగారు. అంతేగాక తన హయాంలో కేంద్రానికి అత్యధిక డివిడెండ్లనూ ముట్టజెప్పారు. గడిచిన ఆరేండ్లలో రూ.6,61,024 కోట్లను అందించారు మరి. గత ఆర్థిక సంవత్సరంలోనే రికార్డు స్థాయిలో రూ.2,11,000 కోట్ల డివిడెండ్‌ను ప్రకటించారు. ఇక ఆర్బీఐకి కొత్తగా వస్తున్న గవర్నర్ సంజయ్ మల్హోత్రా అనుభవజ్ఞుడని, ఆయన సారథ్యంలో ఆర్బీఐ మరింత బలపడగలదన్న ఆశాభావాన్ని ఈ సందర్భంగా దాస్ వ్యక్తం చేశారు. ఇదిలావుంటే దేశ ఆర్థిక వ్యవస్థకు ఏది మంచిదనిపిస్తే దాన్నే చేస్తామని సంజయ్ మల్హోత్రా అన్నారు. బుధవారం ఆయన ఆర్బీఐ 26వ గవర్నర్‌గా బాధ్యతలు తీసుకోనున్నారు.

## హైదరాబాద్‌లో ఐసీఏఐ రీసర్చ్ హబ్

న్యూఢిల్లీ : చార్టర్డ్ అకౌంటెంట్స్ అపెక్స్ బాడీ ఐసీఏఐ..హైదరాబాద్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీవోఈ) రీసర్చ్ హబ్‌ను ప్రారంభించింది. ఈ సీవోఈ డీన్, డైరెక్టర్‌గా నూపుర్ పవన్ బంగ్‌ను నియమించింది ఐసీఏఐ. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టనున్న సార్వత్రిక బడ్జెట్‌తోపాటు ఆర్థిక అక్షరాస్యత, పాలసీల రూపకల్పన, సులభతర వాణిజ్యంలో సీఏల పాత్రపై కులంకుశకంగా చర్చించడానికి ఈ హబ్‌ను ఏర్పాటు చేసినట్లు ఐసీఏఐ ప్రెసిడెంట్ రంజీత్ కుమార్ అగర్వాల్ వెల్లడించారు. ప్రస్తుతం ఐసీఏఐకి హైదరాబాద్‌తోపాటు జైపూర్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు ఉండగా, వచ్చే ఏడాది జనవరిలో కోల్‌కతాలోనూ ప్రారంభించబోతున్నట్లు ఆయన ప్రకటించారు. అలాగే వచ్చే మూడేండ్లలో మరో ఎనిమిది సీవోఈలను దేశవ్యాప్తంగా ప్రారంభించనున్నట్లు చెప్పారు.

**కుదేలైన ఎల్ఐసీ షేరు**

ముంబై, డిసెంబర్ 10: దేశీయ బీమా దిగ్గజం ఎల్ఐసీకి గట్టి షాక్ తగిలింది. గత కొన్ని నెలలుగా ప్రీమియం వసూళ్లు పెరుగుతూ వచ్చిన సంస్థకు గత నెలలో ఎదురుదెబ్బ తగిలింది. ప్రీమియం వసూళ్లు 27 శాతం తగ్గింది. దీంతో కంపెనీ షేరు కుప్పకూలింది. రూ.982.95 వద్ద ప్రారంభమైన కంపెనీ షేరు ఇంట్రాడేలో రూ.951కి పడిపోయింది. మార్కెట్ ముగిసే సమయానికి 3.95 శాతం లేదా రూ.38.95 తగ్గి రూ.947.40కి పడిపోయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఎనిమిది నెలల్లో ప్రీమియం వసూళ్లు 16 శాతం వరకు పెరిగినప్పటికీ, నవంబర్‌లో మాత్రం భారీగా తగ్గాయి. వీటిలో రిటైల్ ప్రీమియం వసూళ్లు 19 శాతం తగ్గగా, వార్షిక ప్రీమియం వసూళ్లు 12 శాతం తగ్గాయి. ప్రభుత్వ బీమా దిగ్గజానికి ప్రైవేట్ సంస్థల నుంచి పోటీ తీవ్రతరం కావడంతో ప్రీమియం వసూళ్లు క్రమంగా తగ్గుతున్నాయి. స్టాక్ మార్కెట్లు తీవ్ర హెచ్చుతగ్గుదలకు లోనయ్యాయి. సెన్సెక్స్ 1.59 పాయింట్లు పెరిగి 81,510 వద్దకు చేరుకోగా, నిఫ్టీ 8.95 పాయింట్లు తగ్గి 24,610 వద్ద ముగిసింది.


## బ్యాంకుల రుణాల్లో మొండి బాకీలు 3.09 శాతం..

### వెల్లడించిన కేంద్ర మంత్రి పంకజ్ చౌదరి

ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో స్థూల మొండి బకాయిలు రూ.3.16 లక్షల కోట్లు అని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి చెప్పారు. గత సెప్టెంబర్ 30 నాటికి బ్యాంకులు మంజూరు చేసిన రుణాల్లో మొండి బకాయిల వాటా 3.09 శాతం అని మంగళవారం రాజ్యసభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు రాత పూర్వకంగా సమాధానమిస్తూ ఈ సంగతి తెలిపారు. 2024 సెప్టెంబర్ 30 నాటికి ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో రూ.3,16,331 కోట్ల మొండి బకాయిలు ఉన్నాయని పంకజ్ చౌదరి వెల్లడించారు. ప్రైవేట్ రంగ బ్యాంకుల మొండి బకాయిలు రూ.1,34,339 కోట్లు అని తెలిపారు. మొండి బకాయిల్లో ప్రభుత్వ రంగాల వాటా 3.09 శాతం కాగా, ప్రైవేట్ బ్యాంకుల్లో 1.86 శాతం అని వివరించారు.

## మోటరోలా నుంచి ఎంట్రీ లెవల్ ఫోన్ మోటో జీ35 5జీ.. ఇవీ డిటెయిల్స్..!

ప్రముఖ స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థ మోటరోలా తన మోటో జీ35 5జీ ఫోన్‌ను మంగళవారం భారత్ మార్కెట్లో ఆవిష్కరించింది. యూనిసోక్ టీ760 ప్రాసెసర్, 50-మెగా పిక్సెల్ డ్యుయల్ రేర్ కెమెరా, సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం 16-మెగా పిక్సెల్ సెన్సర్ కెమెరాలతో వచ్చింది. కార్నింగ్ గ్లాస్ 3 ప్రొటెక్షన్‌తోపాటు 6.72 అంగుళాల ఫుల్ హెచ్డీం ఎల్‌సీడీ స్క్రీన్ కలిగి ఉంటుంది. మోటో జీ55 ఫోన్ తోపాటు మోటో జీ35 5జీ ఫోన్ కూడా సెలెక్టెడ్ యూరప్ మార్కెట్లలో గత ఆగస్టు నెలలో ఆవిస్కరించింది. మోటో జీ35 5జీ ఫోన్ 4 జీబీ ర్యామ్ విత్ 128 జీబీ స్టోరేజీ వేరియంట్ ధర రూ.9,999 పలుకుతుంది. ఫ్లిప్ కార్ట్, మోటరోలా ఇండియా ఆన్ లైన్ స్టోర్ ద్వారా బుక్ చేసుకోవచ్చు. గువా రెడ్, లీఫ్ గ్రీన్, మిడ్ నైట్ బ్లాక్ కలర్ ఆప్షన్లలో లభిస్తుంది. ఆండ్రాయిడ్ 14 బేస్డ్ హెల్లో యూఐ స్కిన్ ఓఎస్ వర్షన్‌పై పని చేస్తున్న ఫోన్ విజన్ బూస్టర్, నైట్ విజన్ మోడ్‌లో అందుబాటులో ఉంది. 50-మెగా పిక్సెల్ క్వాడ్ పిక్సెల్ ప్రైమరీ రేర్ సెన్సర్ కెమెరా, 8-మెగా పిక్సెల్ సెన్సర్ విత్ అల్ట్రా వైడ్ యాంగిల్ లెన్స్ కెమెరా, సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం 16-మెగా పిక్సెల్ సెన్సర్ కెమెరా ఉంటాయి. డోల్బీ అట్మోస్ బ్యాక్డ్ స్టీరియో స్పీకర్స్ తో వస్తున్న మోటో జీ35 5జీ ఫోన్ సెక్యూరిటీ కోసం సైడ్ మౌంటెడ్ ఫింగర్ ప్రింటర్ సెన్సర్ ఉంటుంది. దీంతోపాటు ప్రాగ్జిమిటీ సెన్సర్, యాక్సెలరోమీటర్, అంబియెంట్ లైట్, గైరోస్కోప్, ఎస్ఏఆర్ సెన్సర్, ఈ- కంపాస్ సెన్సర్ తదితరాలు ఉంటాయి. 20 వాట్ల వైర్డ్ చార్జింగ్ మద్దతుతో 5000 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీ వస్తుంది. 5జీ, డ్యుయల్ బాండ్ వైఫై, బ్లూటూత్ 5.0, జీపీఎస్, ఏ-జీపీఎస్, గ్లోనాస్, గెలిలియో, క్యూజడ్ఎస్ఎస్ 3.5 ఎంఎం ఆడియో జాక్, యూఎస్బీ టైప్-సీ కనెక్టివిటీ కలిగి ఉంటుంది.






## క్విక్ కామర్స్ లోకి అమెజాన్.. బెంగళూరు నుంచి షురూ..!

దేశీయంగా క్విక్ కామర్స్ బిజినెస్‌కు రోజురోజుకు ఆదరణ పెరుగుతున్నది. దీంతో పలు సంస్థలు క్విక్ కామర్స్ సేవలు అందించడానికి సిద్ధం అవుతున్నాయి. ప్రముఖ ఈ-కామర్స్ ప్లాట్ ఫామ్ అమెజాన్ సైతం ఈ జాబితాలోకి వచ్చి చేరుతోంది. ఈ నెలాఖరులోగా క్విక్ కామర్స్ సేవలు అందుబాటులోకి తెస్తున్నట్లు అమెజాన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అమిత్ అగర్వాల్ తెలిపారు. తొలుత బెంగళూరు నగర వాసులకు ఈ సర్వీసులు అందిస్తామన్నారు. క్విక్ కామర్స్ సేవల్లో వెయ్యి నుంచి రెండు వేల ఉత్పత్తులను కస్టమర్లకు డెలివరీ చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ పైలట్ ప్రాజెక్టు సక్సెస్ అయితే మున్ముందు ఇతర నగరాలకు క్విక్ కామర్స్ సేవలు విస్తరిస్తామని చెప్పారు. క్విక్ కామర్స్ అంటే.. ఆర్డర్ చేసిన 15 నిమిషాల్లో కస్టమర్లకు డోర్ డెలివరీ చేయడం. ఈ రంగంలోకి అమెజాన్ ఎంటర్ కావడం ఇదే ప్రథమం. వచ్చే ఏడాది క్విక్ కామర్స్ రంగంలోకి ఎంటర్ కావాలని మొదట భావించిన అమెజాన్.. రోజురోజుకు కొత్త సంస్థలు వచ్చి చేరుతుండటంతో తన ప్రయత్నాలు ముమ్మరం చేసింది. క్విక్ కామర్స్ సేవల కోసం అమెజాన్.. ప్రత్యేకంగా సిబ్బంది నియామకం చేపట్టినట్లు సమాచారం. ఇప్పటికే బ్లింకిట్, స్విగ్గీ, జెప్టో, ఫ్లిప్ కార్ట్ కూడా క్విక్ కామర్స్ సేవలు ప్రారంభించాయి. రిలయన్స్, టాటా సన్స్ కూడా ఈ రంగంలోకి ప్రవేశించడానికి సిద్ధం అవుతున్నాయి.

## స్థూల ఎన్‌పిఎలు రూ.4.5 లక్షల కోట్లు

న్యూఢిల్లీ : దేశంలో ప్రభుత్వ, ప్రయివేటు రంగ బ్యాంక్‌ల్లో మొత్తంగా రూ.4.5 లక్షల కోట్ల స్థూల మొండి బాకీలు ఉన్నాయని ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. 2024 సెప్టెంబర్ 30 నాటికి ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల్లో రూ.3.16 లక్షల కోట్ల స్థూల ఎన్‌పిఎలు ఉండగా.. ప్రయివేటు బ్యాంక్‌ల్లో రూ.1,34,339 కోట్ల మొండి బాకీలు నమోదయ్యాయని ఆయన రాజ్యసభకు తెలిపారు. ప్రభుత్వ రంగ బ్యాంక్ మొత్తం రుణాల్లో 3.09 శాతం, ప్రయివేటు రంగ బ్యాంక్‌ల్లో అప్పుల్లో 1.86 శాతం చొప్పున రుణాలు ఎన్‌పిఎలుగా మారాయన్నారు. 2024 మార్చి 31 నాటికి 580 మంది రుణ గ్రహీతల సంస్థలు రూ.50 కోట్ల పైగా బ్యాంక్‌లు ఎగ్గొట్టాయన్నారు. సెప్టెంబర్ 30 నాటికి దేశంలో 1,068 కార్పొరేట్ దివాలా కేసులు పరిష్కార ప్రక్రియలో ఉన్నాయన్నారు. వీటి రికవరీ విలువ రూ.3.55 లక్షల కోట్లుగా ఉందన్నారు





## ఆస్ట్రేలియా వర్సెస్ ఇండియా.. బాక్సింగ్ డే టెస్టు తొలి రోజు టికెట్లు సోల్డౌట్

ఆస్ట్రేలియా, ఇండియా మధ్య జరిగే బాక్సింగ్ డే టెస్టుకు చెందిన తొలి రోజు టికెట్లు పూర్తిగా అమ్ముడుపోయాయి. డిసెంబర్ 26వ తేదీన నాలుగవ టెస్టు ప్రారంభంకానున్నది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా జరుగుతున్న టెస్టు సిరీస్‌లో.. ఇరు జట్లు చెరో విజయాన్ని నమోదు చేశాయి. తొలి టెస్టును ఇండియా గెలుచుకోగా, రెండో టెస్టును ఆసీస్ సొంతం చేసుకున్నది. శనివారం నుంచి బ్రిస్బేన్‌లో మూడవ టెస్టు ప్రారంభంకానున్నది. అయితే మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగే బాక్సింగ్ డే టెస్టుకు ప్రత్యేక క్రేజీ ఉంటుంది. ఆ టెస్టుకు చెందిన డే వన్ టికెట్లు అన్నీ అమ్ముడుపోయినట్లు క్రికెట్ ఆస్ట్రేలియా ఇవాళ ప్రకటించింది. నాన్ మెంబర్స్ కోసం డిసెంబర్ 24వ తేదీన కొన్నిటికెట్లను అమ్మకానికి రిలీజ్ చేయనున్నట్లు క్రికెట్ ఆస్ట్రేలియా తెలిపింది. అడిలైడ్ టెస్టును లక్షా 35 వేల మంది ప్రేక్షకులు ప్రత్యక్షంగా వీక్షించారు. తొలి రోజు స్టేడియానికి సుమారు 36 వేల మంది ప్రేక్షకులు హాజరయ్యారు. పెర్త్ టెస్టుకు కూడా భారీ సంఖ్యలో ప్రేక్షకులు హాజరైనట్లు రికార్డులు చెబుతున్నాయి.



## గాడియం చాంప్స్ భవేశ్, చిన్మయ్

గాడియ స్పోర్టోఫియా బ్యాడ్మింటన్ టోర్నీలో భవేశ్‌రెడ్డి, చిన్మయ్ విజేతలుగా నిలిచారు. మంగళవారం ముగిసిన టోర్నీ డబుల్స్ ఫైనల్లో భవేశ్‌రెడ్డి, చిన్మయ్ జోడీ 21-15, 17-21, 21-13తో డెన్నిస్ రోనవీ, లియాన్స్ జెలా ద్వయంపై గెలిచి టైటిల్ సొంతం చేసుకుంది. బాలుర సింగిల్స్ తుది పోరులో భవేశ్ 20-22, 12-21తో చిన్మయ్ చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచాడు. బాలుర అండర్-11 విభాగంలో శ్రీరాం శహంత, బాలికల కేటగిరీలో మదలస సాయి విజేతలుగా నిలిచారు. టైటిల్ గెలిచిన ప్లేయర్లను ప్రియాంశు రజావత్, రామకృష్ణారెడ్డి పతకాలు అందజేశారు.




### 5 టెస్టులు.. 20 డకౌట్స్.. బ్రిస్బేన్ టెస్ట్‌కు ముందు

## షాకిస్తోన్న టీమిండియా బ్యాటింగ్ లెక్కలు

ఆస్ట్రేలియా టూర్‌లో అడిలైడ్ టెస్టులో భారత క్రికెట్ జట్టు ఓడిపోయింది. పింక్ బాల్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత బ్యాట్స్‌మెన్స్ ఘోరంగా విఫలమయ్యారు. రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ భారత జట్టు 200 పరుగుల మార్కును కూడా అందుకోలేకపోయింది. తొలి ఇన్నింగ్స్‌లో 180 పరుగులు మాత్రమే చేయగా, రెండో ఇన్నింగ్స్‌లో 175 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఫలితంగా మూడు రోజుల్లోనే భారత్ 10 వికెట్ల తేడాతో ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. దీంతో పెర్త్ టెస్టులో విజయం సాధించి సిరీస్‌లో సాధించిన ఆధిక్యాన్ని భారత్ కోల్పోయింది. ఇప్పుడు మూడో టెస్టు బ్రిస్బేన్‌లో జరగనుంది. అయితే, ఈ మ్యాచ్‌కు ముందు గత ఐదు టెస్టుల్లో భారత జట్టు బ్యాటింగ్ గణాంకాలు వెల్లడయ్యాయి. ఇది చూసిన అభిమానులు తలలు పట్టుకుంటున్నారు. గత ఐదు టెస్టుల్లో భారత జట్టు బ్యాటింగ్ ఘోరంగా నిరాశపరిచింది. వీటిలో న్యూజిలాండ్‌తో మూడు టెస్టులు, ఆస్ట్రేలియాతో రెండు టెస్టులు ఉన్నాయి. ఈ ఐదు టెస్టుల్లో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ సగటు 15.28 మాత్రమే. రెండో ఇన్నింగ్స్‌లో స్వల్ప మెరుగుదల ఉన్నప్పటికీ ఈ సగటు 29.84గా ఉంది. గత ఐదు టెస్టుల్లో భారత్ 10 ఇన్నింగ్స్‌ల్లో ఆరింటిలో 200 పరుగులు కూడా చేయలేకపోయింది. ఈ కారణంగానే కివీ జట్టుపై 3-0తో వైట్‌వాష్ అయింది. జస్ప్రీత్ బుమ్రా అద్భుతమైన బౌలింగ్ పెర్త్‌లో విజయానికి దారితీసింది. అయితే, అతను అడిలైడ్‌లో వెనుకబడినప్పుడు, భారత్ ఓటమిని ఎదుర్కోవలసి వచ్చింది. గత ఐదు టెస్టుల్లో భారత బ్యాట్స్‌మెన్స్ ఎనిమిది అర్ధ సెంచరీలు, మూడు సెంచరీలు మాత్రమే చేయగలిగారు. తొలి ఇన్నింగ్స్‌లో రెండు అర్ధసెంచరీలు నమోదు కాగా ఎలాంటి సెంచరీ నమోదు కాలేదు. రెండో ఇన్నింగ్స్‌లో మూడు సెంచరీలు, ఆరు హాఫ్ సెంచరీలు వచ్చాయి. ఈ సెంచరీలను సర్ఫరాజ్ ఖాన్, యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లీ నమోదు చేశారు. గత ఐదు టెస్టుల్లో భారత బ్యాట్స్‌మెన్ ఖాతా తెరవకుండానే 20 సార్లు అవుటయ్యారు. ఇందులో తొలి ఇన్నింగ్స్‌లో 15 జీరోలుగా రాగా, రెండో ఇన్నింగ్స్‌లో ఐదు డకౌట్‌లు వచ్చాయి. ఇది చాలా ఆందోళన కలిగించే అంశం. ఆస్ట్రేలియాతో జరిగిన గత రెండు టెస్టుల్లో 20 మందిలో ఆరు డకౌట్లు వచ్చాయి.

## దర్శినికి స్వర్ణం: ఏషియన్ స్కూల్ చెస్ చాంపియన్‌షిప్

బ్యాంకాక్(థాయ్‌లాండ్) వేదికగా జరిగిన ప్రతిష్ఠాత్మక ఏషియన్ స్కూల్ చెస్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు చెందిన శ్రీదర్శిని పసిడి పతకంతో మెరిసింది. టీమ్ ర్యాంకింగ్ ఈవెంట్‌లో పోటీకి దిగిన దర్శిని అద్భుత ప్రదర్శన కనబరిచింది. ప్రత్యర్థులకు దీటైన పోటీనిస్తూ ముందుకు సాగిన ఈ యువ చెస్ ప్లేయర్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఏషియన్ చెస్ టోర్నీలో మెరిసిన దర్శినిని రాష్ట్ర చెస్ అసోసియేషన్ ప్రత్యేకంగా అభినందించింది.



## అబు దాబి టీ10 లీగ్‌లో ఫిక్సింగ్.. అసిస్టెంట్ కోచ్‌పై ఆరేళ్ల నిషేధం



మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడిన సన్నీ ధిల్లాన్‌కు ఆరేళ్ల బ్యాన్ విధించింది ఐసీసీ. ఎమిరేట్స్ క్రికెట్ బోర్డు ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అబు దాబి టీ10 క్రికెట్ లో ఓ ఫ్రాంచైజీకి చెందిన మాజీ అసిస్టెంట్ కోచ్‌ను అన్ని ఫార్మాట్ల క్రికెట్ నుంచి బహిష్కరిస్తున్నట్లు అంతర్జాతీయ క్రికెట్ మండలి తన ప్రకటనలో తెలిపింది. యాంటీ కరప్షన్ కోడ్‌ను ఉల్లంఘించిన 8 మందిలో అసిస్టెంట్ కోచ్ ధిల్లాన్ ఒకరు. 2021లో జరిగిన అబుదాబి టీ10 క్రికెట్ లీగ్‌లో ఫిక్సింగ్‌కు పాల్పడినట్లు ధిల్లాన్‌పై ఆరోపణలు ఉన్నాయి. అతను మ్యాచ్‌ను ప్రభావితం చేసే ప్రయత్నం చేసినట్లు అభియోగాలు నమోదు అయ్యాయి.

## క్రికెటర్ టు పెయింటర్

### చిత్రకారునిగా మారిన ఒలాంగా



జింబాబ్వే మాజీ పేసర్ హెన్రీ ఒలాంగా పేరు గుర్తుండే ఉంటుంది. తన స్వింగ్ బౌలింగ్‌తో దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్‌ను ఇబ్బంది పెట్టిన ఒలాంగా ఇప్పుడు కొత్త కెరీర్ ఎంచుకున్నాడు. తాజాగా ముగిసిన అడిలైడ్ టెస్టులో ఒలాంగా పెయింటర్‌గా కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. 2003లో చివరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడిన ఒలాం గా..రచయి తగా, సామాజిక కార్యకర్తగా, అంపైర్‌గా, కోచ్‌గా పాత్రలు పోషించి ఇప్పుడు పెయింటర్‌గా తన ప్రతిభ నిరూపించుకుంటున్నాడు. అడిలైడ్ టెస్టు సందర్భంగా పెయిటింగ్ చేస్తు న్న ఒలాంగాను గుర్తించిన కొందరు అభిమానులు ఎక్స్‌లో పోస్ట్ చేయడంతో అది వైరల్‌గా మారింది.



### అల్లు అర్జున్ దెబ్బకు బాక్సాఫీస్ షేక్..

## పుష్ప 2 వసూళ్ల బీభత్సం..

గత కొన్ని రోజులుగా పాన్ ఇండియా బాక్సాఫీస్?ను షేక్ చేస్తోంది పుష్ప 2. డిసెంబర్ 5న విడుదలైన ఈ చిత్రం థియేటర్లలో విధ్వంసం సృష్టిస్తోంది. డైరెక్టర్ సుకుమార్ తెరకెక్కించిన ఈ సినిమాకు ప్రపంచవ్యాప్తంగా ఊహించని రెస్పాన్స్ వస్తుంది. ఇందులో అల్లు అర్జున్ మాస్ నట విశ్వరూపం చూసి ఆశ్చర్యపోతున్నారు నెటిజన్స్. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన పుష్ప 2 ఇప్పుడు బాక్సాఫీస్ వద్ద సత్తా చాటుతుంది. నాలుగు రోజుల్లోనే రూ.829 కోట్ల గ్రాస్ రాబట్టి సరికొత్త రికార్డ్ క్రియేట్ చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా అత్యధిక వసూళ్లు రాబడుతూ దూసుకుపోతుంది. డైరెక్టర్ సుకుమార్ డైరెక్షన్, అల్లు అర్జున్ నటవిశ్వరూపం చూసి అడియన్స్, విమర్శకులు ఫిదా అవుతున్నారు. ఈ సినిమా మొదటి రోజు ఏకంగా రూ.294 కోట్ల గ్రాస్ రాబట్టింది. ఇక ఆదివారం ఒక్కరోజే రెండు వందల కోట్ల వరకు రాట్టింది. హిందీ మార్కెట్లోనే రూ.86 కోట్లు కలెక్ట్ చేసిన సినిమాగా పుష్ప 2 నిలిచింది. ఇక సోమవారం సైతం పుష్ప 2 వసూళ్లు భారీగానే వచ్చినట్లుగా తెలుస్తోంది ఐదో రోజు రూ.80 నుంచి వంద కోట్లు వరకు వచ్చినట్లు సమాచారం. ప్రతీరోజూ పుష్ప రూ.150 నుంచి రూ.200 కోట్లకు పైగా రాబట్టింది. ఇప్పుడు ఐదు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.900 కోట్ల మార్క్ దాటబోతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. మేకర్స్ ముందు నుంచి చెబుతున్నట్లుగానే రూ.1000 కోట్లు రాబట్టేలా ఉంది. ఇప్పటివరకు ఈ సినిమా రూ.830 కోట్ల వరకు రాబట్టినట్లు సమాచారం. ఇక సోమవారం లెక్కలు కలిపితే ఈ సినిమా రూ.900 కోట్లు రావడం ఖాయమని తెలుస్తోంది. ఆరు రోజుల్లో ఈ చిత్రం రూ.1000 కోట్ల మార్క్ క్రాస్ చేసేలా ఉంది.

## సిల్క్ స్మిత కథతో మరో సినిమా.. ఆసక్తికరంగా గ్లింప్స్..



కొన్ని కథలు.. కొందరి జీవితాలు ఎప్పుడూ ట్రెండింగే..! ఎన్నిసార్లు చూసినా.. ఎన్నిసార్లు చదివినా ఇంకా ఏదో కొత్త విషయం ఉందేమో.. ఇంకేదైనా మిస్ అయ్యామేమో అనిపిస్తుంది. అలాంటి కథ, అలాంటి జీవితం సిల్క్ స్మిత సొంతం. అందుకే ఆమె జీవితంపై మరో సినిమా వస్తుంది. మరి ఈసారి ఎవరు బయోపిక్ తీస్తున్నారు..? వాళ్లేం కొత్తగా చూపించబోతున్నారు..? సిల్క్ స్మిత.. పరిచయం అక్కర్లేని పేరు. 80, 90 దశకాల్లో ఈమె పేరు వినిపిస్తే చాలు సినిమా థియేటర్స్ నిండిపోయేవి. సిల్క్ బొమ్మ స్క్రీన్ మీద కనిపిస్తే కలెక్షన్లు వాటంతటవే వచ్చేవి. ఆమె లేకపోతే కనీసం సినిమాలు కూడా కొనేవాళ్లు కాదు బయ్యర్లు. అలాంటి ఇమేజ్ సొంతం చేసుకుని.. చివరికి ఒంటరిగా జీవితాన్ని చాలించారు సిల్క్ స్మిత. సిల్క్ స్మిత జీవితంపై ఇప్పటికే కొన్ని బయోపిక్స్ వచ్చాయి. అందులో అందరికీ గుర్తుండిపోయే సినిమా డర్టీ పిక్చర్. 2011లో విద్యా బాలన్ హీరోయిన్‌గా వచ్చిన ఈ చిత్రం సంచలనం సృష్టించింది. అయితే ఇది ఒరిజినల్ స్టోరీ కాదని.. సిల్క్ జీవితాన్ని తప్పుగా చూపించారనే వాళ్లు లేకపోలేదు. ఆ తర్వాత క్లైమాక్స్ అనే సినిమా కూడా సిల్క్ కథతోనే వచ్చింది. అయితే ఈ సినిమా అంతగా ఆకట్టుకోలేకపోయింది. మరోసారి సిల్క్ స్మిత కథతో ఓ సినిమా తెరకెక్కుతుంది. దీన్ని తాజాగా ప్రకటించారు మేకర్స్. డిసెంబర్ 2న సిల్క్ స్మిత జయంతి సందర్భంగా ఆమె బయోపిక్ ప్రకటించారు. సిల్క్ స్మిత పేరుతోనే రానున్న ఈ సినిమాలో చంద్రికా రవి టైటిల్ రోల్ పోషిస్తున్నారు. జయరామ్ దర్శకుడు. తాజాగా వచ్చిన ఈ సినిమా గ్లింప్స్ ఆసక్తికరంగా ఉంది. ప్రేక్షకులను కూడా ఆకట్టుకుంది. సిల్క్ ఒరిజినల్ బయోపిక్ ఇదే అంటున్నారు మేకర్స్. మరి ఈ సినిమా ఎలాంటి ఇంపాక్ట్ క్రియేట్ చేస్తుందో చూడాలి.

## ఒకే ఫ్రేమ్‌లో రెండు సింహాలు.. ముఫాసా కొత్త పోస్టర్ ఆవిష్కరించిన నమ్రత



మోస్ట్ ఎవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ 'ముఫాసా: ది లయన్ కింగ్' డిసెంబర్ 20, 2024న ఇండియాలో ఇంగ్లీష్, హిందీ, తమిళం, తెలుగు భాషలలో విడుదల కానుంది. బారీ జెంకిన్స్ డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రం 2019లో లైవ్-యాక్షన్ ది లయన్ కింగ్ బ్లాక్ బస్టర్ విజయాన్ని కొనసాగిస్తూ ప్రేక్షకులని అలరించబోతోంది. 'ముఫాసా'కి సూపర్ స్టార్ మహేష్ బాబు వాయిస్ ఇస్తున్నారు. మహేష్ బాబు వాయిస్ ఓవర్ లో రిలీజైన ట్రైలర్ కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ రోజు అభిమానులకు స్పెషల్ ట్రీట్ ఇస్తూ సూపర్ స్టార్ మహేష్ బాబు అద్భుతమైన పోస్టర్‌ను నమ్రతా శిరోద్కర్ ఘట్టమనేని గ్రాండ్ మీడియా ఈవెంట్ లో లాంచ్ చేశారు.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020